తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

కొండా సురేఖ అంశం పార్టీ చూసుకుంటుంది
వ్యాఖ్యానించడానికి నిరాకరించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : కొద్ది రోజులుగా నడుస్తోన్న మంత్రి కొండా సురేఖ అంశం పై వ్యాఖ్యానించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరాకరించారు. ఇంగ్లాడ్ పర్యటన తరువాత సోమవారం హైదరాబాద్ కు చేరుకున్న ముఖ్యమంత్రి మధ్యాహ్నం మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశాన్ని మీడియా ప్రస్తావించింది. ముఖ్యమంత్రి బదులిస్తూ కొండా సురేఖ అంశం పార్టీ చూసుకుంటుంది.. ఆ అంశం క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉంది.. పార్టీ అంతర్గత అంశాలపై మాట్లాడను.. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాలని అన్నారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 274 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | మంగళవారం, ఆగస్టు 25, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ : మంత్రి మాట్లాడుతూ భూసేకరణ వేగవంతంరూ. 250 కోట్ల నిధులు మంజూరుకాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలి.ఆయిల్ ఫామ్ సాగుతో అత్యధిక లాభాలురైతులు ఈ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలిఇంటింటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలివర్షపు నీటిని ఒడిసిపట్టడమే ప్రధాన లక్ష్యంరాష్ట్ర రవాణా బీసీ సంక్షేమం మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొండాపూర్ గ్రామంలో పల్లె పల్లెకు పొన్నం అన్న-వల్లె వల్లెలో ప్రజా పాలన కార్యక్రమం. చిగురుమామిడి: అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, ఇందుకోసం ప్రభుత్వం రూ. 250 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మూడు జిల్లాల కలెక్టర్లు భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో సోమవారం పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వల నిర్మాణానికి సంబంధించి రైతులు సహకరించాలని మంత్రి కోరారు. భూసేకరణ ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా అందరూ సహకరిస్తే, భూములు సేకరించిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను మంత్రి స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ మర్క రాజ్‌కుమార్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహనాచారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి – ఎంపి ఈటల



హైదరాబాద్: భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాను. ఊర్లలో తాతల ఆస్తులు అమ్ముకుని తిరిగేవాన్ని తిరుగుబోతు అనేవారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే పని చేస్తున్నారు. కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ ఏర్పడింది పేదలకు ఇళ్ళ జాగాలు ఇవ్వడానికి, వ్యాపారం చేయడానికి కాదు. రెండో తారీకు ఏర్పాటు చేసిన వేలంపాటను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు.

సోమవారం అయన కూకట్ పల్లిలో మీడియాతో మాట్లాడారు.

ఈటల మాట్లాడుతూ

నిజాం కాలంలో 1908లో వరదలు వచ్చినప్పుడు అనేక ఇళ్లు వరదల్లో కొట్టు పోయాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారు. "సిటీ ఇంప్రూవ్మెంట్ బోర్డ్" 1911 లో నిజాం ఏర్పాటు చేసి ప్రజలకు ఇల్లు కట్టించారు. 1931 లో ''సికింద్రాబాద్ ఇంప్రూవ్మెంట్ బోర్డ్'' ఏర్పాటు చేశారు. ఈ బోర్డ్ 1960 లో హౌసింగ్ బోర్డ్ గా మారింది. ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ భూములు కేటాయించడంతో పాటు రైతుల భూములు కూడా సేకరించారు. కూకట్పల్లి, కైతలాపూర్, హైదర్ నగర్ మూడు గ్రామాల పరిధిలో 1400 ఎకరాలు సేకరించారు. హౌసింగ్ బోర్డ్ ఉద్యోగులకు గజం 1 రూపాయి 25 పైసలకు ఇచ్చారు. ఆర్థిక స్తోమతను బట్టి కొనుక్కొనే విధంగా 66 గజాలు, 111 గజాలు, 311 గజాలు, 400 గజాలు ప్లాటింగ్ చేశారని అన్నారు.

జేఎన్టీయూ కొజ కోసం హౌసింగ్ బోర్డ్ 100 ఎకరాలు లీజుకు ఇచ్చారు. హౌసింగ్ బోర్డ్ ఏర్పడింది పేదవారి సొంత ఇంటి కలను నెరవేర్చడానికి తప్ప వ్యాపారం చేయడానికి కాదు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2005-06 లో కూకట్పల్లిలో భూముల అమ్మకాలు మొదలుపెట్టారు. మలేషియా టౌన్షిప్ కు 36 ఎకరాలు, హిందూ ప్రాజెక్ట్ కు 70 ఎకరాలు, లోధాకు 18 ఎకరాలు, ఇండిస్ వన్ సిటీకి 12 ఎకరాలు అమ్మారు.

స్కూలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాలు, హాస్పిటల్ కట్టుకోవడానికి స్థలాలు కరువయ్యాయి. ఖాళీగా ఉన్న జాగాలను వీటికి కేటాయించండి కానీ అమ్ముకోవద్దు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి కూడా రిప్రజెంటేషన్ ఇచ్చాము. అయినా అమ్ముకుంటున్నారు. హౌసింగ్ బోర్డ్ చట్టం ప్రకారం పేదవారికి ఇళ్ళ జాగాలు ఇవ్వాలి తప్ప ఇలా అమ్ముకోవడానికి హక్కు లేదని అన్నారు.

భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాను. బస్తీలలో పని చేసుకునేవారికి ఊరు అవతల డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తే.. అక్కడ పని లేక వారు.. చేపలను నీళ్లలో నుంచి బయట వేస్తే ఎలా కొట్టుకుని చచ్చిపోతాయో.. వారి పరిస్థితి కూడా అలానే ఉంది. ఎక్కడ ఉన్నవారికి అక్కడే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి ఇవ్వాలి. పేదవారికి కట్టించడానికి మనసు రావడం లేదా? పేదవారి కోసమైతే బడ్జెట్ లేదా ? ఇందిర రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అన్నది కేవలం స్లోగన్ గానే మిగిలిపోయిందని అన్నారు.

22ఎ పై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్నప్రతిపక్షాలు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 24: హైదరాబాద్‌లో 22ంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. 22ంపై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్నాయని ఆయా పార్టీలపై మండిపడ్డారు. గతంలో రిలాక్స్ ఇచ్చిన వాటికి క్లియరెన్స్ ఇచ్చామని తెలిపారు. నిజమైన (జెన్యూన్‌గా) వాటిలో 98 శాతం రిజిస్ట్రేషన్ చేశామన్నారు. చేయలేనివి చేయలేమని తేల్చి చెప్పామని వివరించారు.అయితే టోల్ ఫ్రీ నంబర్ పని చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను మంత్రి పొంగులేటి ఖండించారు. అందులో వాస్తవం లేదని చెప్పారు. ఇప్పటి వరకు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. అందులో రిపీటెడ్ కాల్స్ తొలగిస్తే.. 980 వచ్చాయన్నారు. వాటిలో 547 వ్యవసాయానికి అనుబంధమైనవి, 433 వ్యవసాయేతర కాల్స్ అని వివరించారు. రిజిస్ట్రేషన్ కాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.కొందరు దొంగ జీవోలు, మెమోలు తెచ్చి రిజిస్ట్రేషన్ కోసం ఒత్తిడి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అలాంటివారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి దొంగ జీవోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం సాధ్యం కాదని మంత్రి పొంగులేటి కుండ బద్దలు కొట్టారు. సిఎస్7, సిఎస్ 14పై దశాబ్దాలుగా వివాదాలు ఉన్నాయని గుర్తు చేశారు. తెర ముందు సామాన్యులను పెట్టి వెనక తమ ఎజెండాను అమలు చేస్తున్నారని అన్నారు.వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పలువురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఖరీదైన కార్లు తీసుకుని సిఎస్7, సిఎస్14 భూములు రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ విషయాన్ని లేవనెత్తడంతో వివాదంలో పడ్డాయని వివరించారు. ఆ 811 ఎకరాల భూములపై విచారణకు సిద్ధమా? అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు.సర్వే నంబర్ 403లో సీఎం రేవంత్ రెడ్డి నివాసం ఉంటుందని అన్నారు. ఆ సర్వేలో1,288 ఎకరాలు ఉండగా రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని చెప్పారు.

మహబూబాబాద్ జిల్లా,కలెక్టర్లు, డీఎఫ్ఓ లతో మంత్రి కొండా సురేఖ సన్నాహక సమావేశం.



రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25న నిర్వహించనున్న 'ప్రత్యేక వనమహోత్సవం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులు (డీఎఫ్ఓ)తో మంత్రి సన్నాహక సమావేశం నిర్వహించారు.మంత్రి తన నివాసం నుంచి జూమ్ వేదికగా సమావేశంలో పాల్గొన్నారు. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ అరణ్యభవన్ నుంచి సమావేశంలో పాల్గొన్నారు. పలువురు సీసీఎఫ్‌లు, సీఎఫ్‌లు, అటవీశాఖ అధికారులు హాజరయ్యారు.జిల్లాల వారీగా సమీక్షప్రత్యేక వనమహోత్సవం నిర్వహణకు జిల్లాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, ఇప్పటివరకు జరిగిన పురోగతిని మంత్రి సురేఖ సమీక్షించారు. కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంప్రత్యేక వనమహోత్సవంలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు వనమహోత్సవం దోహదపడేలా కార్యక్రమాలను నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక వనమహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య, లతో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.అనంతరం సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం జిల్లా లక్ష్యాలను శాఖల వారీగా పూర్తి చేయుటకు పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేయాలని రేపు జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, ఈ సమావేశంలో

ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శాసనసభ ఎస్సీ కులాల సంక్షేమ కమిటీ తొలి భేటీ



కరీంనగర్: దళితుల సంక్షేమంపై చర్చహైదరాబాద్ లోని తెలంగాణ శాసనసభ స్పీకర్ ఛాంబర్ అసెంబ్లీ భవనంలో సోమవారం షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ తొలి సమావేశం జరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి కమిటీ చైర్మన్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాత సంక్షేమ పథకాల ప్రభావంపై సమీక్ష చేపట్టాలని సభ్యులు సూచించారు. ఎస్సీ వర్గాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, ఉపాధి, గృహ, భూ పంపిణీ, ఆర్థిక అభివృద్ధి పథకాల అమలుపై చర్చ జరిగింది. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, గురుకులాలు, హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సమావేశం అభిప్రాయపడింది. ఎస్సీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, విద్యా అవకాశాలు, ఉపాధి కల్పన వంటి అంశాలపై జిల్లా స్థాయి సమీక్షలు నిర్వహించాలని సమావేశం ప్రతిపాదించింది. ప్రభుత్వ శాఖల అధికారులు, సంక్షేమ శాఖల నుంచి సమగ్ర వివరాలు తీసుకుని, అవసరమైతే జిల్లాల పర్యటనలు చేపట్టాలని సభ్యులు కోరారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామెల్, ఎడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కె.మాణిక్ రావు, విజయుడు, కౌన్సిల్ సభ్యులు పింగిళి శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యతోపాటు ఆయా సభల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

మంగళవారం, ఆగస్టు 25, 2026

భయపెడుతున్న విద్యా సంక్షోభం

భారత్‌లో మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో యువత డిగ్రీ పట్టాలతో కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. అయితే ఆ చేతికి అందుతున్న సర్టిఫికెట్‌లు మార్కెట్‌లో వారికి ఉద్యోగాలు లభించడం లేదని తేలింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యూహాత్మక, టెక్నికల్ సలహాలను అందించే అత్యున్నత థింక్ ట్యాంక్ నీతి ఆయోగ్ విడుదల చేసిన తాజా నివేదిక దేశంలోని విద్యారంగంలో ఉన్న ఒక భయానక సత్యాన్ని, విద్యా సంక్షోభాన్ని కళ్లకు కట్టినట్టు చూపించింది. నీతి ఆయోగ్ ప్రచురించిన రీఇమేజింగ్ స్కిల్లింగ్ ఫర్ వికసిత్ భారత్ ఏ2047 అనే పత్రం భారత్‌లో విద్యావిధానానికి, ఉద్యోగ మార్కెట్ డిమాండ్లకు మధ్య ఉన్న అగాధాన్ని బయటపెట్టింది. ఆర్థిక సర్వే 2024-25 గణాంకాలను ఉటంకిస్తూ ఈ నివేదిక వెల్లడించిన అత్యంత ఆందోళనకరమైన విషయం ఏంటంటే, భారత్‌లో కేవలం 8.25 శాతం మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే తాము అభ్యసించిన చదువులకు, అర్హతలకు తగిన ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. అంటే మిగిలిన 91.75 శాతం మంది గ్రాడ్యుయేట్‌లు తాము చదివిన చదువుకు ఎటువంటి సంబంధం లేని పనుల్లో లేదా తక్కువ వేతనాల ఉద్యోగాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. లేదా అసలు ఉద్యోగమే లేకుండా నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఇది కేవలం నిరుద్యోగ సమస్య మాత్రమే కాదు, విద్యార్థుల చదువులకు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలనకు మధ్య ఏర్పడిన లోతైన అగాధం. ఈ సంక్షోభం ఎందుకు ఏర్పడింది, లక్షలాది మంది యువత జీవితాలు డిగ్రీలు ఉన్న ఎందుకు ఏర్పడింది? లక్షలాది మంది యువత జీవితాలు డిగ్రీలు ఉన్నా ఎందుకు నిరర్థకంగా మారుతున్నాయో నివేదిక చెప్పింది. ఈ నివేదికలోని అంశాలు సంచలనం సృష్టిస్తున్నాయి. యువత తమ అమూల్యమైన సమయాన్ని, తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ఖర్చు చేసి డిగ్రీలు పొందుతున్నప్పటికీ, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన కనీస నైపుణ్యాలు వారిలో ఉండం లేదనే వాస్తవాన్ని ఈ నివేదిక నిరూపించింది. ఇది కేవలం ఒక విధానపరమైన పత్రం కాదు. భారత్‌లోని విద్యావ్యవస్థ మూలాలను ప్రశ్నించే ఒక తీవ్రమైన హెచ్చరిక మన విద్యా సంస్కరణలు తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే దేశ ఆర్థిక పురోగతి దెబ్బతినే ప్రమాదం ఉంది. భారత్‌లో ఉన్నత విద్య కోసం విపరీతంగా ఖర్చు చేసిన, సంవత్సరాల తరబడి శ్రమించి పట్టాలు పొందుతున్న యువత సంఖ్య నానాటికీ పెరుగుతోంది. కానీ, ఈ డిగ్రీల వల్ల వారికి మంచి కెరీర్ లభించడం లేదు. భారత్‌లో ఉన్నత, టెక్నికల్ విద్యావ్యవస్థలో విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాలకు, శ్రామిక మార్కెట్ ఆశించే నైపుణ్యాలకు మధ్య ఉన్న పెద్ద లోపం స్పష్టంగా కనిపిస్తోందని నీతి ఆయోగ్ గుర్తించింది. అనేక విద్యాసంస్థల్లో ఇప్పటికే కాలం చెల్లిన సిలబస్ బోధిస్తున్నారు. పరిశ్రమల అవసరాలు వేగంగా మారుతున్నప్పటికీ, ఆ మార్పులకు అనుగుణంగా సిలబస్ మారడం లేదు. దీని వల్ల విద్యార్థులు సాధించే డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్లు వారి నైపుణ్యాలను ప్రతిబింబించలేకపోతున్నాయి. వారికి ఉపాధి కల్పించలేకపోతున్నాయి. ప్రస్తుత విద్యావ్యవస్థ కేవలం మార్కులు, పరీక్షల ఫలితాల ఆధారంగానే విజయాన్ని అంచనా వేస్తోంది. నిజమైన ఉపాధి సామర్థ్యాన్ని పెంచడం లేదు. డిగ్రీ పూర్తి చేసిన ఒక యువకుడు లేదా యువతి సమాంలోకి అడుగుపెట్టినప్పుడు , తాము సాధించిన చదువు మార్కెట్ అవసరాలకు ఎంతమాత్రం సరిపోవడం లేదని గ్రహిస్తున్నారు. ఈ పరిస్థితి గ్రాడ్యుయేట్లో నిరాశను పెంచుతోంది. భారత్‌లో సాధారణ సంప్రదాయ డిగ్రీల వైపు విద్యార్థులు విపరీతంగా ఆసక్తి చూపడం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. దేశంలోని ఉన్నత విద్యావ్యవస్థలోని గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. దే?శంలో అండర్ గ్యాడ్యుయేట్ కోర్సుల్లో చేసిన మొత్తం విద్యార్థుల సంఖ్య 3.4 కోట్లు. ఇందులో కేవలం బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ కోర్సుల్లోనే ఏకంగా 1.13 కోట్ల మంది చేరారు. ఇక బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులను కలిపి చూస్తే 2 కోట్లకు దాటిపోతుందీ సంఖ్య. భారత్‌లో ఉన్నత విద్యా వ్యవస్థ ప్రస్తుతం ఒక భారీ ప్యాక్టరీలా మారింది. ఇది ఏటా లక్షలాది మంది గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తోంది. కానీ వారిలో ఎంతమంది ఉద్యోగానికి సిద్ధంగా ఉన్నారనే ప్రశ్న వచ్చినప్పుడు సమాధానం దొరకడం లేదు. దీనికి జనరిక్ డిగ్రీ వ్యవస్థే కారణం. ఈ సంప్రదాయ కోర్సులు విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పరీక్షిస్తాయే తప్ప వారిలో విశ్లేషణాత్మక ఆలోచనను, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంచవు. ఈ కారణంగానే చాలా కంపెనీలు డిగ్రీలు ఉన్నప్పటికీ కొత్త గ్రాడ్యుయేట్‌లకు మళ్లీ మొదటి నుంచి శిక్షణ ఇవ్వాల్సి వస్తోంది. కనీసం ఈమెయిల్ రాయడం, ఎక్సెల్ షీట్ల తయారీ, టైపింగ్, లాంటి ప్రాథమిక నైపుణ్యాలు కూడా సంప్రదాయ బీఏ, బీఎస్సీ, కోర్సుల్లో నేర్పించడం లేదు. ఇది యువకులకు శాపంగా మారుతోంది. కార్పొరేట్ రంగానికి, ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు సంప్రదాయ చదువుల ద్వారా లభించపోవడంతో , దేశంలోని కోట్లాది మంది యువతకు ప్రభుత్వం ఉద్యోగాలే ఏకైక ఆశ్రయంగా మారుతున్నాయి. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు సాధించాలంటే కావాల్సిన నైపుణ్యాలు లేకపోవడం, ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వ కొలువుల వైపు పరుగులు పెడుతున్నారు. నీతి ఆయోగ్ తన నివేదికలో కేవలం సిలబస్‌లోని లోపాలను మాత్రమే కాకుండా కళాశాలల నిర్వహణలోని అనేక ఇతర లోపాలను కూడా ఎండగట్టింది. ముఖ్యంగా ఉన్నత విద్యాసంస్థల్లో కరికులం దాటి విద్యార్థులకు లభించాల్సిన కనీస ఉపాధి మద్దతు కొరవడిందని పేర్కొంది. విద్యాసంస్థల్లోని విద్యార్థులు కనీసం ప్రొఫెషనల్ రెజ్యూమ్ ఎలా రాయాలి, మాక్ ఇంటర్వ్యూలు ఎలా నిర్వహించాలి, ఉద్యోగాల కోసం ఎలా శోధించాలనే విషయాలపై ఎటువంటి అవగాహన ఉండటం లేదు. దీని వల్ల విద్యార్థులు నేరుగా జాబ్ మార్కెట్‌లోకి వచ్చినప్పుడు ప్రతిభ ప్రదర్శించలేకపోతున్నారుఅధ్యాపకులు సరికొత్త టెక్నాలజీ, సబ్జెక్ట్ బోధిస్తున్నప్పటికీ వారికి పరిశ్రమల అవసరాలపై కనీస అవగాహన ఉండటం లేదు.

- ఎడిటర్

ఎన్నికల బరిలో జనసేన



హైదరాబాద్, ఆగస్టు 24, (న్యూస్ పల్స్)తెలంగాణలో ఎన్నికలకు జనసేన ముందుగానే సిద్ధమైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావును ప్రకటించింది. గతంలో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించిన గడల శ్రీనివాసరావు.. ప్రస్తుతం జనసేన రాష్ట్ర నాయకుడిగా, అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావుల సమస్యలను శాసన మండలిలో బలంగా వినిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణలో జరిగే ఎన్నికలకు పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించిన జనసేన పార్టీ అధ్యక్షుడుపవన్ కళ్యాణ్.. ఆ దిశగా ముందస్తుగా అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే త్వరలోనే జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జనసేన పార్టీ ఫోకస్ పెంచింది. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే అభ్యర్థిని ప్రకటించి రాజకీయంగా ముందడుగు వేసింది. ఉమ్మడి ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి డాక్టర్ గడల శ్రీనివాసరావును తమ అభ్యర్థిగా జనసేన పార్టీ తాజాగా ప్రకటించింది. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించినట్లు అర్థమవుతోంది. ఇతర ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్న సమయంలోనే జనసేన తమ అభ్యర్థిని ప్రకటించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముందస్తు ప్రకటనతో ప్రచారం, పట్టభద్ర ఓటర్లతో సంబంధాలు, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై ఎక్కువ సమయం కేటాయించే అవకాశం పార్టీకి లభించనుంది.జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్.. డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ తెలిపింది. ఆయన అభ్యర్థిత్వానికి పవన్ కళ్యాణ్ సుముఖత వ్యక్తం చేయడంతో అధికారికంగా పేరును ప్రకటించినట్లు వెల్లడించింది. డాక్టర్ గడల శ్రీనివాసరావు గతంలో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య రంగంలో సేవలందించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం జనసేన రాష్ట్ర నాయకుడిగా, అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలను గడల శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు.పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి వేదికగా బలంగా వినిపిస్తానని గడల శ్రీనివాసరావు తెలిపారు. తనను అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు పవన్ కళ్యాణ్‌తో పాటు రామ్ తాళ్లూరి, శంకర్ గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, ఉన్నత విద్యావంతులు, మేధావుల మద్దతు కూడగట్టడంపై జనసేన పార్టీ దృష్టి పెట్టనుంది. ఈ ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో తమ రాజకీయ బలాన్ని మరింత పెంచుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.తనకు పట్టభద్రులు మద్దతు ఇస్తే ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని గడల శ్రీనివాసరావు చెప్పారు. 3 ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు తనకు ఆశీస్సులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన జనసేన.. ఇక ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి ప్రచారం, పట్టభద్రులతో సమావేశాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో తమ రాజకీయ బలాన్ని మరింత పెంచుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.తనకు పట్టభద్రులు మద్దతు ఇస్తే ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని గడల శ్రీనివాసరావు చెప్పారు. 3 ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు తనకు ఆశీస్సులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన జనసేన.. ఇక ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి ప్రచారం, పట్టభద్రులతో సమావేశాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. దీంతో ఉమ్మడి ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో జనసేన ప్రవేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

అక్రమ నిర్మాణాల సాజిద్...

హైదరాబాద్, ఆగస్టు 24, (న్యూస్ పల్స్)హైదరాబాద్ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదం అనంతరం బిల్డర్ సయ్యద్ సాజిద్ నిర్మాణాలపై పలు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. చిన్న స్థలాల్లో అనుమతులకు మించి బహుళ అంతస్తుల భవనాలు, హాస్టళ్లు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పార్కు స్థలాన్ని ఆక్రమించి మరో నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. సాజిద్ నిర్మాణ అనుమతులు, నిబంధనల ఉల్లంఘనలు, అధికారుల పాత్రపై అధికారులు దృష్టి సారించారు.హైదరాబాద్ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కుప్పకూలిఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. నాలా పక్కన కేవలం 48 గజాల స్థలంలో నిర్మిస్తున్న ఈ భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు కార్మికుల మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేశ్ కారే , మోపత్‌గా గుర్తించారు. ప్రమాదం అనంతరం భవనం నిర్మాణం, అనుమతులపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో బిల్డర్ సయ్యద్ సాజిద్‌కు సంబంధించి పలు సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. సాజిద్ నిర్మించిన పలు భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. చిన్న స్థలాల్లో అనుమతులకు మించి అంతస్తులు నిర్మించి వాటిని హాస్టళ్లుగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.సాజిద్ గతంలో తన తండ్రి వద్ద కారు మెకానిక్‌గా పనిచేసిన తర్వాత రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలోకి వచ్చినట్లు సమాచారం. నాలుగేళ్లుగా భూవివాదాలు, నిర్మాణాలపై దృష్టి పెట్టి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, కొందరు అధికారులు, కబ్జాదారులతో కలిసి భూములను తక్కువ ధరలకు సొంతం చేసుకుని, వాటిపై బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి విక్రయించినట్లు ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మూడేళ్లలో సాజిద్ ఐదు బహుళ అంతస్తుల భవనాలను నిర్మించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో రెండు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అంజయ్యనగర్‌లో ప్రమాదం జరిగిన సమయంలోనే సమీపంలోని మరో భవనంలో ఆరో అంతస్తు స్లాబ్ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.సాజిద్ కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని ఆక్రమించి అక్కడ కూడా ఏడంతస్తుల భవనం నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇంటిని విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతో నిర్మాణ రంగంలోకి ప్రవేశించినట్లు సమాచారం. అనంతరం సరైన ఇంజినీరింగ్ ప్రణాళికలు లేకుండానే కాంట్రాక్టులు తీసుకుని హాస్టళ్లు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికారులకు లంచాలు ఇచ్చి అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు ఉన్నాయని తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.ప్రమాదంపై పోలీసు, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, హైడ్రా అధికారులు సమన్వయంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరించినట్లు తేలితే సంబంధిత అధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్మాణ అనుమతులు, భవన భద్రత, నిబంధనల అమలుపై కఠిన పర్యవేక్షణ అవసరమని స్థానికులు అంటున్నారు.

పేరు గొప్ప... ఊరు దిబ్బ

150 టాప్ కంపెనీలకు నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 24, (న్యూస్ పల్స్)దేశంలోని ఫుడ్ కంపెనీలు, రెస్టారెంట్లు, హోటల్స్ కనీసం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఇటీవల కొద్ది రోజులుగా దీనిపై ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఫోకస్ పెట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మెరుపు తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వాటిపై చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో పలు దిగ్గజ కంపెనీలకు కొద్ది నెలల్లోనే 150 కిపైగా నోటీసులు జారీచేసినట్టు ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా వివరాలను ప్రకటించింది. వీటిలో ఈ కామర్స్ కంపెనీలు కూడా ఉన్నాయి.వినియోదారులను ఆకట్టుకోడానికి మోసపూరిత ప్రకటనలు, తప్పుడు వాదనలు, లేబెలింగ్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతోన్న పలు సంస్థలపై భారత ఆహార భద్రత, ప్రమాణాల అధికార సంస్థ కఠిన చర్యలు చేపట్టింది. నెస్లే ఇండియా, పెప్సికో, కోకా-కోలా వంటి ప్రముఖ దిగ్గజాలు సహా పలు కంపెనీలకు గత కొన్ని నెలల్లో 150కి పైగా నోటీసులు జారీ చేసినట్లు తాజాగా ప్రకటించింది. నెస్లే, పెప్సికో, అబాట్ ఇండియా, రెడ్ బుల్, డానోన్, మోండెలెజ్ (డైరీ మిల్క్), కోకా-కోలా, డయాజియో, ఫెరెరో ఇండియా వంటి బడా సంస్థలకు ఈఐఎంఎ నోటీసులు ఇచ్చింది.కేఎఫ్‌సీ (మెక్‌డొనాల్డ్స్, పిజ్జా హట్, డోమినోస్, కాఫీ డే వంటి ప్రముఖ ఫుడ్ సర్వీస్ సంస్థలకు 30కి పైగా నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా నిబంధనలు పాటించని డోమినోస్‌కు చెందిన 5 లైసెన్స్‌లను రద్దు చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించినందుకు గాను ఓ అమెజాన్ వేర్‌హౌస్ లైసెన్స్‌ను అధికారులు రద్దు చేశారు. ఈ కామర్స్ కంపెనీలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు 12 నోటీసులు జారీచేసింది.ఎనర్జీ డ్రింక్స్ తయారీ సంస్థలు (మోన్‌స్టర్, హెల్), ఆల్కహాలిక్ పానీయ సంస్థలపై కూడా దాడులు చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నోటీసులు అందుకున్న తర్వాత అనేక కంపెనీలు తమ ప్రకటనలు, లేబెలింగ్‌లలో సరిదిద్దుకునే చర్యలు ప్రారంభించాయని వెల్లడించింది. ఇటీవల దేశవ్యాప్తంగా పలు మెట్రో సిటీలు సహా అనేక నగరాల్లో ఎఫ్ఎస్ఎస్ఏఐ నేతృత్వంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఫైవ్‌స్టార్ హోటల్స్, బడా రెస్టారెంట్లలో అపరిశుభ్ర పరిస్థితులకు కళ్లకు కడుతున్నాయి. వందలాది కిలోల కుళ్లిపోయిన మాంసం, పాడైపోయిన ఆహార పదార్థాలు చూసి అధికారులే విస్తుపోతున్నారు. ఇటీవల బెంగళూరులోని కర్ణాటక అసెంబ్లీలో ఎమ్మెల్యే క్యాంటీన్లలో గడువు ముగిసిన సరుకులను గుర్తించిన సంగతి తెలిసిందే. అక్కడ ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్ కస్టమర్లకు అందించే ఆహారంలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని వెల్లడయ్యింది. దిగ్గజాలుగా చెలామణి అవుతోన్న ఆహార ఉత్పత్తి సంస్థలదే అదే దారి.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తేనే కాంగ్రెస్ బలోపేతం
టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



మెదక్, ప్రతినిధి ఆగస్టు 24 (తెలంగాణ పవర్): గ్రామాల్లో కార్యకర్తలు బలంగా ఉన్నప్పుడే కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేలా కార్యకర్తలు చొరవ చూపాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తే కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.మెదక్ జిల్లా కేంద్రంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్‌రావు, సంజీవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, జగ్గారెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా గతంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేదని, తిరిగి కంచుకోటగా మార్చేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని, ఓట్లు గల్లంతైన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించేలా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పేదవాడి ఓటును కాపాడుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ నెల 26 వరకు కొనసాగనున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు పర్యవేక్షించాలని సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుందని మహేష్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు, పేదలకు చేరువలో వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలమని, వారికి అన్యాయం జరగకుండా నాయకులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యకర్తలను పార్టీ కాపాడుకుంటుందని, ఓటర్లను కాపాడే బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీలో వర్గ విభేదాలకు తావివ్వకుండా అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 1000 మొక్కలను నాటాలి

సిద్దిపేట , నేడు ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 1000 మొక్కలను నాటాలని కలెక్టర్ కె. హైమావతి అధికారుల ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షం కురుస్తుందని మరో రెండు, మూడు రోజులు కంటిన్యూగా వర్షం పడే అవకాశం ఉన్నందున మొక్కలు నాటడానికి ఇది సరైన సమయమని అన్నారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా 17 లక్షల 68 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని అన్నారు. ఇప్పటికే మొక్కలు నాటడానికి 2 లక్షల పైగా గుంతలు త్రవ్వి సిద్ధంగా ఉంచడం జరిగిందని, మిగతా గుంతలు తవ్వి మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ లతోపాటు అని మున్సిపాలిటీలలో నిర్దేశిత మీద మొక్కలు నాటాలని, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇరిగేషన్ శాఖ ఖాళీ భూములలో మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అధికారులను, ప్రజలను ఇన్వాల్వ్ చేస్తూ శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటాలని, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. అదేవిధంగా వర్షాలు కురుస్తున్నందున దోమలు పెరిగే అవకాశం ఉన్నందనీ అన్ని రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో రేపు శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గల 780 మంది టీబీ పేషెంట్స్ మెడిసిన్స్ వాడడంపై వైద్య శాఖ అధికారులతో రివ్యూ చేయాలని అన్నారు.

మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి.

క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై సమీక్షా సమావేశం .

క్రిటికల్ కేర్ బ్లాక్ ను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా .





మెదక్ ప్రతినిధి ఆగస్టు 24. తెలంగాణ పవర్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు మెదక్ జిల్లా కేంద్రం లోని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ ను స్థానిక శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారితో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై ++ఎ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సునీత దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా నితిన్ కత్రా, ణవీనూ డా. జ్ఞానేశ్వర్, ణజనూ డా. శివ దయాళ్, వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్ష లో ్రాజజ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హనుమంత రావు గార్లు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఎ= ఎక్విప్మెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ×ఎఖీమీ సేవలను అందుబాటులోకి తేవడం పై రేపు (ఝ్ఫవ. 25.08.2026) న హైదరాబాద్ సచివాలయం లో ఉన్నత స్థాయి సమావేశం కు రావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు అధికారులను ఆదేశించారు. అలాగే,

++ఎ ఆసుపత్రి లో వైద్య సేవల బలోపేతం పై మంత్రి చర్చించారు. ++ఎ నూతన భవన నిర్మాణం పై చర్చించారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం పై చర్చించారు. తూప్రాన్ లో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ లలో కిడ్నీ రోగులకు అందిస్తున్న డయాలసిస్ సేవలపై చర్చించారు. మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ. 7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ

పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని, ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి వారి ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

అనంతరం కిచెన్‌లో తయారు చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి మంత్రి స్వీకరించారు.

2011లో హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లోని రోగుల సహాయకులకు ఆహారం అందించే కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం అమలు అవుతోందన్నారు.

హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద 10 మైళ్ల పరిధిలో ఒక్కరు కూడా ఆకలితో ఉండకూడదనే సందేశం తెలంగాణ ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలిచిందని మంత్రి తెలిపారు. హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌తో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆహార భద్రత కల్పించే కార్యక్రమాలను చేపడుతోందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో తొలుత కొడంగల్ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఈ పథకం అమలుతో కొడంగల్ నియోజకవర్గంలో పాఠశాల విద్యార్థుల హాజరు 21 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కొడంగల్‌తో పాటు మధిరలో కూడా అల్పాహార పథకం అమలు చేస్తున్నామని తెలిపారు.

జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన సూచనల మేరకు సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ. 7.5 కోట్ల వ్యయంతో మంథనిలో ఆధునిక యంత్రాలతో ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఈ యంత్రలు గంటలో 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ఉందని

విద్యార్థులకు ప్రతిరోజూ విభిన్న రకాల అల్పాహారం అందించేలా ప్రత్యేక మెనూను రూపొందించామని మంత్రి తెలిపారు. వారానికి కనీసం మూడు సార్లు విద్యార్థులకు పాలు అందించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని అన్నారు. పిల్లలకు ప్రతిరోజూ ఒకే రకమైన ఆహారం కాకుండా వివిధ రకాల టిఫిన్లను అందిస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్న మంత్రి, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఒక విద్యార్థిని గతంలో ఆహారం లేకుండానే పాఠశాలకు హాజరయ్యే పరిస్థితి ఉండేదని తన కష్టాలను మంత్రితో పంచుకుంది. ఇలాంటి పరిస్థితులను విద్యార్థులు ఇకపై ఎదుర్కోకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అల్పాహార పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.అనంతరం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనల మేరకు జిల్లాలో విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అధ్యయనాల ప్రకారం విద్యాశాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై ప్రత్యేక దృష్టి సారించి కొత్త ఉపాధ్యాయులను నియమించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని కలెక్టర్ తెలిపారు. తాజాగా ప్రారంభించిన అల్పాహార పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.

జిల్లాలో ఉపాధ్యాయులు చేస్తున్న మంచి పనికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇటీవల రామగుండం ప్రాంతానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు ఫిన్‌లాండ్‌లో శిక్షణా కార్యక్రమానికి ఎంపికయ్యారని, భవిష్యత్తులో మరింత మంది ఉపాధ్యాయులు విదేశాల్లో శిక్షణ పొందేలా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం, నాణ్యమైన విద్య ఉచితంగా అందుతున్నందున తల్లిదండ్రులు ఎలాంటి సందేహాలు లేకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న,మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసిల్దార్ ఆరిపోద్దిన్,ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేసులకు భయపడేది లేదు.. ప్రజల పక్షాన పోరాటం ఆపేది లేదు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేయాలనే ఆలోచన విరమించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు




భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 24 తెలంగాణ పవర్ : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని టీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా తాను భయపడేది లేదని, ప్రజల పక్షాన తన గొంతు వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. రేవంత్ సర్కార్ చేస్తున్న తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని అన్నారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేయాలనే ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మణుగూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. రేగా కాంతారావుపై నమోదైన కేసును కోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తెలంగాణ తల్లి, కొమరం భీమ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మణుగూరు పట్టణంలోని కిన్నెరా కల్యాణ మండపంలో రేగా కాంతారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న వారిని అణచివేయాలనే ఉద్దేశంతోనే తనపై వరుసగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎక్కడ నిరసన కార్యక్రమం జరిగినా దానిని తనకు ముడిపెట్టడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో తన వాహనంపై దాడి జరిగినప్పుడు సైతం తానే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు.తనపై తప్పుడు ప్రచారం చేయించేందుకు కొంతమంది నాయకులు పత్రికల్లో కథనాలు రాయించేందుకు ప్రలోభాలకు గురిచేశారని రేగా కాంతారావు ఆరోపించారు. తాను పదవిలో ఉన్న సమయంలో ఎవరి వద్ద నుంచి అన్యాయంగా, అక్రమంగా ఏమీ తీసుకోలేదని, అక్రమ ఆస్తులు కూడబెట్టుకోలేదని స్పష్టం చేశారు. తన పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులపైనే వివాదాలు సృష్టిస్తున్నారని అన్నారు. తన ఆస్తులపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, అవి అక్రమంగా సంపాదించినవా కాదా తేల్చాలని సవాల్ విసిరారు.గిరిజనుల నుంచి కౌలుకు తీసుకున్న భూములకు సంబంధించిన డబ్బులు కూడా వారికి చెల్లించానని పేర్కొన్నారు. పోడు భూముల కోసం తాను చేస్తున్న పోరాటాన్ని అడ్డుకునేందుకు తనకు వేలాది ఎకరాల అటవీ భూములు ఉన్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

తనపై ప్రస్తుత ఎమ్మెల్యేతో పాటు జిల్లాలోని ముగ్గురు మంత్రులు చేసిన ఆరోపణలను నిరూపించాలని రేగా కాంతారావు సవాల్ విసిరారు. దమ్ముంటే మణుగూరు అంబేద్కర్ సెంటర్‌కు వచ్చి బహిరంగ చర్చకు సిద్ధం కావాలని అన్నారు. తనపై తప్పుడు కేసులు పెట్టించినా చివరకు న్యాయమే గెలిచిందని పేర్కొన్నారు.రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని రేగా కాంతారావు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేశారో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా సమస్యలపై చివరి వరకు పోరాడుతానని, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు ఎంపీటీసీలు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

పవర్ ఎగ్జిబిషన్--2026 రెండో రోజు విశేషాలు

హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్--2026 రెండో రోజు సందర్శకులతో కళకళలాడింది. ఉదయం నుంచే పాఠశాల విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యుత్ రంగంలో చోటుచేసుకుంటున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విద్యుత్ వంపిణీ వ్యవస్థ, భద్రతా ప్రమాణాలు మరియు విద్యుత్ సంస్కరణలపై ఆసక్తిగా అవగాహన పొందారు.



ప్రత్యేకంగా స్కూల్ విద్యార్థులు వివిధ స్టాళ్లను సందర్శిస్తూ విద్యుత్ ఉత్పత్తి నుండి వినియోగదారుల ఇళ్ల వరకు విద్యుత్ ఎలా చేరుతుందనే అంశాలను అధికారులు, ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు, స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భద్రతా పరికరాలు, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలు, పునరుత్పాదక ఇంధన వనరులు వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

విద్యుత్ రంగంలో ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతికతలు, కృత్రిమ మేధస్సు (ూ×) ఆధారిత సేవలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు, విద్యుత్ అంతరాయాల నివారణకు చేపడుతున్న చర్యలు, వినియోగదారులకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవల గురించి అధికారులు వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకుంటూ విద్యుత్ రంగంపై మరింత అవగాహన పెంపొందించుకున్నారు.

అలాగే విద్యుత్ భద్రతకు సంబంధించిన ప్రత్యేక స్టాళ్లలో విద్యుత్ ప్రమాదాల నివారణ, సురక్షిత వినియోగ పద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలు విద్యార్థులకు విద్యుత్ భద్రతపై విలువైన అవగాహన కల్పించాయి.

రూ.146.71 కోట్ల వ్యయం తో రహదారి పనులలు

శంకుస్థాపన చేసిన మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి

నాగర్ కర్నూల్ జిల్లా: ప్రతినిధి తెలంగాణ పవర్ ఆగష్టు- 24: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్‌లో రూ. 146.71 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు నూవీ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రహదారి పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. వనపర్తి–1 ప్యాకేజీ కింద అచ్చంపేట ఫేజ్–1లో ఈ పనులను చేపట్టనున్నారు.

మూడు రహదారి పనులు ఇవీ..

- రూ. రూ. 32.99 కోట్లతో అమ్రాబాద్--తొల్పులపల్లి రహదారి: పదర, వాంకేశ్వరం, చిట్లముకుంట, ఉడిమిల్ల, ఇప్పలపల్లి గ్రామాల మీదుగా కిలోమీటర్ 0/000 నుంచి 34/200 వరకు రహదారిని బలోపేతం చేయనున్నారు.
- రూ. 35.71 కోట్లతో బల్మూర్--నాగర్‌కర్నూల్ పీడబ్ల్యూడీ రహదారి: బల్మూర్, గోడల్, తుమ్మన్‌పేట గ్రామాల మీదుగా రహదారిని రెండు లేన్లుగా విస్తరించనున్నారు.
- రూ. 78.01 కోట్లతో అచ్చంపేట--రాకొండ (ఉప్పునుంతల మీదుగా) రహదారి: ఉప్పునుంతల, మొల్గర, పెద్దాపూర్, మామిళ్లపల్లి, రాకొండ గ్రామాల మీదుగా రెండు లేన్లుగా విస్తరించనున్నారు.



బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్ గడల కళావతి..... చైర్మన్ చల్లా సరస్వతీ

ఖమ్మం బ్యూరో తెలంగాణ పవర్ ఆగస్టు 24: తనికెళ్ళ ప్రాథమిక పాఠశాల (హెచ్ డబ్ల్యూ) నందు బ్రేక్ ఫాస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీమతి గడల కళావతి, అపెక్ చైర్మన్ శ్రీమతి చల్లా సరస్వతి, వార్డు సభ్యులు కొర్లకంటి గోపి, తనికెళ్ల పూర్వ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్ గోపాల్ రావు,సిపిఐ మండల కార్యదర్శి భాస్కర్,గ్రామ పెద్దలు శాస సత్యనారాయణ,చల్ల లాలయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసిరెడ్డి రామ్మోహన్,పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది, కొలకటి మరియమ్మ,ఎడబంగి కమలమ్మ,విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు, పిల్లలు ఉత్సాహంగా టిఫిన్ తిని సంతోషాన్ని వ్యక్తం చేశారు,సర్పంచ్ మాట్లాడుతూ ప్రతిరోజు టైం టూ టైం టిఫిన్ తిని, అందరూ బడికి హాజరు కావాలని మాట్లాడారు,....!



82 శాతం మంది భారతీయుల స్మార్ట్‌ఫోన్‌లు డ్యామేజ్..

- కానీ రక్షణ తీసుకుంటున్నది 15 మందిలో ఒక్కరే - వన్‌అసిస్ట్--హన్సా రీసెర్చ్ నివేదికలో వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 19, 2026: భారతీయుల నిత్య జీవితంలో స్మార్ట్‌ఫోన్‌లు అత్యంత కీలకంగా మారాయి. వాటి రక్షణ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని ప్రముఖ ఇన్సూర్‌టెక్ ప్లాట్‌ఫామ్ 'వన్‌అసిస్ట్', 'హన్సా రీసెర్చ్' తాజా నివేదికలో వెల్లడైంది. 82 శాతం మంది కనీసం ఒక్కసారైనా తమ ఫోన్‌ను చేజార్చి కింద పడేయడం, 72 శాతం మంది ఫోన్ డ్యామేజ్‌ను ఎదుర్కోవడం సాధారణంగా మారింది. కేవలం 6 నుంచి 8 శాతం మంది మాత్రమే యాక్టివ్ ప్రొటెక్షన్ ప్లాన్‌లను కలిగి ఉన్నారని 'ది గ్రేట్ ఇండియన్ స్మార్ట్‌ఫోన్ ప్రొటెక్షన్ క్రైసిస్' సర్వే స్పష్టం చేసింది.

ఈ సందర్భంగా వన్‌అసిస్ట్ కో-ఫౌండర్ సుబ్రత్ పానీ మాట్లాడుతూ ఈ పరిశోధన వినియోగదారులలోని ఒక ఆసక్తికరమైన వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజల సంభాషణలు, లావాదేవీలు, ఉద్యోగ వనులు, వినోదానికి స్మార్ట్‌ఫోన్‌లు అత్యవసరంగా మారాయన్నారు. ప్రమాదవశాత్తూ డ్యామేజ్ కావడం సర్వసాధారణమైన అనుభవంగా మారిందన్నారు. అయినా, చాలా మంది వినియోగదారులు డ్యామేజ్, బ్రేక్‌డౌన్ గురించి నిరంతరం ఆందోళన చెందుతూ, ఎటువంటి రక్షణ లేకుండానే తమ డివైస్‌లను వాడుతున్నారన్నారు.

ఇన్సూర్‌టెక్ ప్లాట్‌ఫామ్ వన్‌అసిస్ట్, 'హన్సా రీసెర్చ్' భాగస్వామ్యంతో రూపొందించిన తమ తాజా నివేదిక 'ది గ్రేట్ ఇండియన్ స్మార్ట్‌ఫోన్ ప్రొటెక్షన్ క్రైసిస్' ఫలితాలను ఈరోజు విడుదల చేసింది. ఈ నివేదిక భారతదేశ వ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ వినియోగం, ప్రమాదవశాత్తూ జరిగే నష్టం, ప్రొటెక్షన్ ప్లాన్‌ల వినియోగాన్ని విశ్లేషించింది. స్మార్ట్‌ఫోన్లపై వినియోగదారుల ఆధారపడటం పెరగడం, పరికరాల ధరలు అధికమవడం, వాటిని ఎక్కువ కాలం పాటు వాడుతుండటం వంటి అంశాలు ఉన్నప్పటికీ, రక్షణ ప్లాన్లను తీసుకోవడంలో ప్రజలు వెనుకంజ వేస్తున్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది.

ఫోన్ డ్యామేజ్ వల్ల కలిగే భావోద్వేగ ప్రభావం కూడా అంతే తీవ్రంగా ఉంటుంది. ఫోన్ కింద పడగానే 35 శాతం మంది భారతీయులు తీవ్ర ఆందోళనకు గురవుతుండగా, 24 శాతం మంది ఆ ఘటనపై ఇతరులతో గొడవ పడ్డారు. మరో 15 శాయ మంది ఫోన్ పాడవడం వల్ల తమ ప్రణాళికలను రద్దు చేసుకున్నారు. పురుషులతో (33 శాతం) పోలిస్తే మహిళల్లో ఈ ఆందోళన మరింత ఎక్కువగా (43 శాతం) ఉంది. ప్రమాదవశాత్తూ కింద పడటం, స్క్రీన్ పగలడం ప్రధాన కారణాలుగా నిలవగా, జేబులు లేదా బ్యాగుల నుంచి ఫోన్లు జారిపడటం వల్లే 36 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని అధ్యయనం ప్రత్యేకంగా గుర్తించింది. తమ డివైస్ వినియోగ జీవితకాలంలో ఎప్పుడో ఒకసారి మాత్రమే స్మార్ట్‌ఫోన్ ప్రొటెక్షన్ ప్లాన్‌ను ఉపయోగించామని కేవలం 36 శాతం మంది వినియోగదారులు తెలపగా, ప్రస్తుతం యాక్టివ్‌గా ప్రొటెక్షన్ కలిగి ఉన్నవారు కేవలం 6--8 శాతం మాత్రమే ఉన్నారు. అవగాహనకు, యాక్టివ్ కవరేజీకి మధ్య ఉన్న ఈ భారీ వ్యత్యాసం వినియోగదారుల ప్రవర్తనను తెలియజేస్తోంది.

స్మార్ట్‌ఫోన్ ప్రొటెక్షన్ ప్లాన్‌లపై అవగాహన ఉన్నప్పటికి, అధిక ఖర్చులు, ప్లాన్‌ల ప్రయోజనాలపై స్పష్టత లేకపోవడం, క్లెయిమ్ ప్రక్రియపై నమ్మకం కుదరకపోవడమే వీటిని తీసుకోకపోవడానికి ప్రధాన కారణాలని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఫోన్ పాడైనప్పుడు భారతీయులు సొంతంగా చేసే తాత్కాలిక చిట్కాలను కూడా ఈ అధ్యయనం వెల్లడించింది. నీటిలో పడిన ఫోన్లను బాగు చేసేందుకు 29 శాతం మంది బియ్యంలో పెట్టగా, పగిలిన ఫోన్ విడిపోకుండా ఉంచేందుకు 20--32 శాతం మంది టేప్ లేదా ఇతర తాత్కాలిక పరిష్కారాలను ఆశ్రయిస్తున్నారు. రిపేర్ చేయించుకోవడానికి వెనుకాడటం, డ్యామేజ్ అయిన ఫోన్‌తోనే సర్దుకుపోయే ధోరణి ఎంత సాధారణమైపోయిందో ఈ ప్రయోగాలు తెలియజేస్తున్నాయి. సోషల్ మీడియా వినియోగంలో మహిళలు 79 శాయ (పురుషులు 69 శాతం), ఫోన్‌ను ప్రమాదవశాత్తూ కింద పడేసిన వారిలో 94 శాయ (పురుషులు 80 శాతం), డ్యామేజ్ ఎదుర్కొన్న వారిలో 79 శాతం (పురుషులు 71 శాతం) మహిళలే ఉన్నారు. భావోద్వేగ పరంగా కూడా ఫోన్ పడినప్పుడు మహిళల్లో 43 శాతం మంది ఆందోళన చెందగా, పురుషుల్లో ఇది 33 శాతం గా ఉంది. మహిళల్లో జరిగే ఫోన్ నష్టాలు ఎక్కువగా ఇంటి పరిసరాలతో ముడిపడి ఉన్నాయి.

కొత్త ఫోన్ల కంటే సెకండ్ హ్యాండ్ పరికరాలకే ప్రొటెక్షన్ ప్లాన్లు మరింత ముఖ్యమని 70 శాతం మంది వినియోగదారులు భావిస్తుండగా, వారంటీ లేదా ప్రొటెక్షన్ ప్లాన్ అందుబాటులో ఉంటే సెకండ్ హ్యాండ్ డివైస్‌ను కొనుగోలు చేయడాన్ని పరిశీలిస్తామని 30 శాతం మంది తెలిపారు. మెట్రో నగరాల్లో 30 శాతం మందితో పోలిస్తే, నాన్-మెట్రో నగరాల్లోని 54 శాతం మంది వినియోగదారులు సెకండ్ హ్యాండ్ స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వన్‌అసిస్ట్ కో-ఫౌండర్ సుబ్రత్ పానీ మాట్లాడుతూ ఈ పరిశోధన వినియోగదారులలోని ఒక ఆసక్తికరమైన వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజల సంభాషణలు, లావాదేవీలు, ఉద్యోగ వనులు, వినోదానికి స్మార్ట్‌ఫోన్‌లు అత్యవసరంగా మారాయన్నారు. ప్రమాదవశాత్తూ డ్యామేజ్ కావడం సర్వసాధారణమైన అనుభవంగా మారిందన్నారు. అయినా, చాలా మంది వినియోగదారులు డ్యామేజ్, బ్రేక్‌డౌన్ గురించి నిరంతరం ఆందోళన చెందుతూ, ఎటువంటి రక్షణ లేకుండానే తమ డివైస్‌లను వాడుతున్నారన్నారు. పరికరాల విలువ పెరిగి, వినియోగ కాలం పొడిగించబడుతున్న కొద్దీ, వినియోగదారులు తమ డివైస్ వినియోగ ప్రయాణంలో విశ్వాసాన్ని, మనశ్శాంతిని కోరుకుంటున్నారని తెలిపారు


టీయూడబ్ల్యూజే కార్యాలయాన్ని సందర్శించిన చండీగఢ్ ప్రెస్ క్లబ్ బృందం



జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని అభినందించింది. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి వారి వెంట ఉన్నారు.

హైదరాబాద్ ఆగస్టు 24: చండీగఢ్ ప్రెస్ క్లబ్ ఆఫీస్ బేరర్ల బృందం సోమవారం బషీర్ బాగ్ లోని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) కార్యాలయాన్ని సందర్శించింది. చండీగఢ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దుగ్గల్ నేతృత్వంలోని జర్నలిస్టుల బృందం ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఐజేయు మాజీ అధ్యక్షుడుకే శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను శ్రీనివాస్ రెడ్డి వారికి వివరించారు. అలాగే జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం యూనియన్ చేస్తున్న కృషిని వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా యూనియన్ కార్యకలాపాల పనితీరును వారికి వివరించారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాల వివరాలను తెలుసుకొని చండీగఢ్ జర్నలిస్టుల బృందం ప్రశంసించింది. వృత్తిపరంగా నిబద్ధత కలిగిన

పి. రాజేశ్వరరావు సంస్మరణ సభలో ఘన నివాళి



విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మాజీ మేనేజర్ పి.రాజేశ్వరరావు ఆగస్టు 9, 2026 ఆదివారం ఉదయం 11 గంటలకు తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి సంతాపంగా నవచేతన పబ్లిషింగ్ హౌస్ మరియు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మాజీ ఉద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం (24.08.2026) అబిడ్స్‌లోని నవచేతన బుక్ హౌస్‌లో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, సాహితీ ప్రముఖులు, పబ్లిషర్లు, ఉద్యోగులు రాజేశ్వరరావుకు ఘన నివాళులు అర్పించారు.

సంస్మరణ సభకు రాజేశ్వరరావు పెద్ద కుమార్తె శైలజ, అల్లుడు పవన్ కుమార్, మనవడు కృష్ణ సాత్విక్ హాజరయ్యారు.

నవచేతన ఉద్యోగులు పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ నారాయణరెడ్డి, బుక్ హౌస్ మేనేజర్ లక్ష్మీతో పాటు బుక్ హౌస్ ఉద్యోగులు సభలో పాల్గొన్నారు. విశాలాంధ్ర ఉద్యోగి వి. ప్రకాష్, విశాలాంధ్ర మాజీ ఉద్యోగులు ఎస్. రాజా, జనార్ధన్, ఎల్.ఎస్.ఎస్. భాస్కర్ రావు, సి. రాజేశ్వర్, జీ. తిరుపాల్, జయశ్రీ, ఝాన్సీ రాణి తదితరులు హాజరై రాజేశ్వరరావుకు నివాళులు అర్పించారు.

సీపీఐ పార్టీ తరఫున తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య సభ్యురాలు ప్రేమ్ పావని, శ్రీనివాసులు నాయుడు, తెలంగాణ అరసం రాష్ట్ర కార్యదర్శి రాపూలు సుదర్శన్ పాల్గొన్నారు. పబ్లిషర్ల తరఫున శృతి కాంతి భారతి, శోభన్ బాబు (తెలుగు బుక్ హౌస్), తెలంగాణ పబ్లికేషన్స్‌కు చెందిన కోయ చంద్రమోహన్ పాల్గొని రాజేశ్వరరావుతో తమకున్న అనుబంధాన్ని, ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పి. రాజేశ్వరరావు పుస్తక ప్రచురణ రంగానికి, విశాలాంధ్ర సంస్థ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కుటుంబం నుంచి వచ్చిన రాజేశ్వరరావు సుదీర్ఘకాలం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌లో జనరల్ మేనేజర్‌గా సేవలందించి పదవీ విరమణ చేశారని గుర్తుచేశారు. తెలుగు పుస్తక ప్రచురణ రంగంలో ఆయన చేసిన కృషిని, సహచరులతో ఆయనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

రాజేశ్వరరావు మరణం తెలుగు ప్రచురణ రంగానికి, తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆశయాలు, పుస్తక ప్రచురణ రంగానికి చేసిన సేవలు ఎప్పటికీ స్మరణీయంగా ఉంటాయని అన్నారు.

తక్కువ ఖర్చుతో ప్రైవేట్ ఆసుపత్రులు పేదలకు మెరుగైన సేవలందించాలి

- సినీ నటులు బాబు మోహన్

అంతర్జాతీయ ప్రమాణాలతో "చిరంజీవి వెరికోస్ వాస్కులర్ ఉ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్" ప్రారంభం



సామాన్యులకు ప్రైవేట్ ఆసుపత్రుల సేవలు చాలా ఖరీదైనవిగా ఉంటున్నాయని, తక్కువ ఖర్చుతో ప్రైవేట్ ఆసుపత్రులు పేదలకు మెరుగైన సేవలందించాలని సినీ నటులు, మాజీ ఎమ్యెల్యే, బాబు మోహన్ కోరారు. హైదరాబాద్, కొండాపూర్ లో ఆదివారం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, ఆధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన "చిరంజీవి వెరికోస్ వాస్కులర్ ఉ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్లానింగ్ అండ్ లాజిస్టిక్స్ ఇన్స్పెక్టర్ జనరల్ డాక్టర్ భోపాల్ గజరావు తోకలసి బాబు మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను బాబు మోహన్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వెరికోస్ వెయిన్స్, కాళ్లలో రక్తనాళాల సంబంధిత సమస్యలు, ఇతర వాస్కులర్ వ్యాధులకు ఆధునిక వైద్య విధానాలతో నాణ్యమైన చికిత్స అందించాలనే లక్ష్యంతో ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయం అని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి వైద్య సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ వెరికోస్ వెయిన్స్ నిపుణులు డాక్టర్ కె. సంజీవరావు, డాక్టర్ శిల్ప పొన్నాడ, ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కె. వంశీకృష్ణ లు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో చిరంజీవి వెరికోస్ వాస్కులర్ ఉ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభించామని తెలిపారు. రోగులకు సులభంగా, సమర్థవంతంగా వైద్య సేవలు అందించేందుకు అధునాతన వైద్య సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, సమగ్ర చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. "ప్రతి అడుగులో ఆరోగ్యం -- ప్రతి జీవితంలో నమ్మకం" అనే లక్ష్యంతో వెరికోస్ వెయిన్స్‌తో పాటు వివిధ విభాగాల్లో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రజలకు అందించనున్నట్లు వెల్లడించారు. ఏ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ సభ్యులు గొట్టముక్కల వెంకటేశ్వరరావు, రంగస్థల దర్శకులు ఈ. సముద్ర, వీరభద్ర చౌదరి, తెలంగాణ ఆర్టిస్టు అసోసియేషన్ అధ్యక్షులు అన్నంగి రాజశేఖర్, నిర్మాత మిత్తాన ఈశ్వర్, హీరోయిన్ సైనిక తదితరులు పాల్గొన్నారు

వ్యవస్థాపకుడి తర్వాత: ప్రతికూల పరిస్థితులు లుపిన్ తదుపరి తరాన్ని ఎలా తీర్చిదిద్దాయి

లుపిన్‌కు, ణదీ+ మరణం తర్వాతి సంవత్సరాలు, సహస్రాబ్ది ప్రారంభం నుంచి సాగిన అద్భుతమైన ప్రయాణం అనంతరం కఠిన సమయాలను ఎదుర్కొనే లుపిన్ సంయుక్త నాయకత్వ నిర్మాణ సామర్థ్యానికి తొలి పరీక్షగా నిలిచాయి. తోబుట్టువులకు అది కష్టకాలం. కానీ వారి వ్యక్తిత్వాలు వృత్తిపరంగానూ, వ్యక్తిగతంగానూ పరస్పరం పూరకంగా ఉండేవి. మరింత ముఖ్యంగా, వాస్తవాన్ని ఎవరూ ఓడించలేరని వారు గుర్తించారు మరియు తప్పులను సరిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నారు. అమెరికాలో వినితా నిర్వహించిన బాధ్యతలు ఆమెకు ఫార్మా పరిశ్రమలో ప్రపంచ దృక్పథాన్ని, నెట్‌వర్క్‌ను అందించాయి. ఆమె మంచి శ్రోత, పరిస్థితులకు ఆలోచనాత్మకంగా స్పందించేది మరియు సామరస్యాన్ని కోరుకునేది. అన్నింటికంటే మించి, ఆమె తన అంతఃప్రజ్ఞను విశ్వసించేది.

నిలేష్ బాధ్యతలు అతని డేటా ఆధారిత దృష్టి, వివరాలపై శ్రద్ధ మరియు నమ్మకమైన బృందాలను నిర్మించే సామర్థ్యంతో బాగా సరిపోయేవి, ఇవన్నీ స్నేహపూర్వకమైన, తనను తాను తక్కువగా చూపించుకునే హాస్యభావనతో మరియు బాధ్యతలను స్పష్టంగా అప్పగించే తీరుతో కూడి ఉండేవి. లుపిన్ పరిశోధన మరియు సాంకేతిక కార్యకలాపాలతో పాటు భారత వ్యాపారాన్ని నడపడంలో అతని విజయం అతన్ని వ్యూహాత్మక నాయకుడిగా నిలబెట్టింది.

ణదీ+ విలువలు 'కుటుంబమే ముందు' అనే విధానాన్ని బలపరిచాయి. మరియు తమ పర్యవేక్షణలో ఎదురైన ఎదురుదెబ్బల నుంచి తోబుట్టువులు కలిసి నేర్చుకున్నారు. అమెరికా జెనరిక్స్ వ్యాపారాన్ని కంపెనీ టాప్‌లైన్ మరియు లాభాల్లో అతిపెద్ద వాటాదారుగా మార్చేందుకు వారు విజయవంతంగా కలిసి పనిచేశారు.

వినితా మరియు నిలేష్ ఐదు దిశల్లో ఒక పునరుద్ధరణ కార్యక్రమాన్ని రూపొందించారు: పోర్ట్‌ఫోలియో, భౌగోళిక విస్తృతి, ఖర్చులు మరియు సిబ్బంది హేతుబద్ధీకరణ; అమెరికా మరియు యూరప్‌లో జెనరిక్స్ నుంచి కాంప్లెక్స్ జెనరిక్స్ వైపు మారడం; భారతదేశంపై మరింత దృష్టి కేంద్రీకరించడం; తయారీలో నాణ్యత సమస్యలను పరిష్కరించడం; మరియు అమెరికా జెనరిక్స్, పరిశోధన, తయారీ, నాణ్యత మరియు హెచ్‌ఆర్ కోసం నాయకత్వ బృందాన్ని పునరుద్ధరించడం.

మహమ్మారి తర్వాత, అమెరికాలోనూ ప్రపంచవ్యాప్తంగా కూడా శ్వాసకోశ విభాగం కంపెనీకి అతిపెద్ద థెరపీ ఏరియాగా అవతరించింది, 2025లో ఆదాయాల్లో నాలుగో వంతును మరియు లాభాల్లో గణనీయమైన భాగాన్ని అందించింది. భారతదేశంలో పెరిగిన సామర్థ్యం మరియు వేగవంతమైన వృద్ధి అమెరికా పునర్వ్యవస్థీకరణకు తోడ్పడ్డాయి. ఇన్-లైసెన్సింగ్ ఒప్పందాలను నిర్మించడం మరియు బ్రాండ్లను కొనుగోలు చేయడం ద్వారా లుపిన్ వైద్యులు, ఆసుపత్రులు మరియు రోగుల మధ్య తన చేరువను విస్తరించుకుంది. ణదీ+ లుపిన్‌ను ప్రారంభించినప్పటి నుంచి ఎల్లప్పుడూ బలంగా ఉన్న భారతదేశ సేల్స్ ఫోర్స్, 2024 నాటికి 4,200 నుంచి ముప్పై ఆరు విభాగాల్లో 10,000కు పైగా పెరిగింది. కార్డియాలజీ, డయాబెటిస్ మరియు శ్వాసకోశానికి చెందిన ప్రధాన దీర్ఘకాలిక వ్యాధి క్లస్టర్లు, అధిక విలువైన ప్రిస్క్రిప్షన్లతో, ఇప్పుడు భారత ప్రాంతపు అమ్మకాలలో 60% వాటాను కలిగి ఉన్నాయి. కొత్త విభాగాలను ఏర్పాటు చేయడం, కొత్త ఉత్పత్తుల ప్రారంభాలతో పాటు, జీర్ణాశయ సంబంధిత మరియు గైనకాలజీ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న థెరపీ ఏరియాలను లుపిన్ దేశీయ వ్యాపారం పెద్ద స్థాయిలో కవర్ చేసేలా చేసింది.

వినితా మరియు నిలేష్ బృందాన్ని వునాది నుంచి వునర్నిర్మించారు, సాంకేతికంగా బలమైన మరియు ఉత్సాహభరితమైన నాయకులను స్వయంగా ఎంపిక చేసి, సంస్థలోకి కొత్త శక్తిని మరియు ప్రపంచ స్థాయి నైపుణ్యాన్ని తీసుకువచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లు మరియు ప్రధాన సాంకేతిక విధుల్లో కూడా వారు నాయకత్వాన్ని బలోపేతం చేశారు.

సంక్షోభం తర్వాత ఏడు సంవత్సరాలకు, వినితా మరియు నిలేష్ లుపిన్ ప్రతిష్ఠను మరియు మనోధైర్యాన్ని పునరుద్ధరించడంలో విజయం సాధించారు. వృద్ధి రెండంకెలకు తిరిగి వచ్చింది, మరియు లాభదాయకత మళ్లీ సమాన స్థాయి సంస్థల స్థాయికి చేరుకుంది.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఘనంగా "భావయామి గోపాలం" కూచిపూడి నృత్యోత్సవం



హైదరాబాద్: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మయూరి నృత్యాలయ ఆధ్వర్యంలో "భావయామి గోపాలం" పేరుతో ఘనంగా కూచిపూడి నృత్యోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, నృత్య కళాకారులు శ్రీకృష్ణుని బాలలీలలు, గోపికాభక్తి, కృష్ణతత్వాన్ని ప్రతిబింబించే అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు.

సాంప్రదాయ కూచిపూడి నృత్యానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రత్యక్ష వాద్య బృందం సహకారంతో నిర్వహించిన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నృత్యం, సంగీతం, అభినయంతో శ్రీకృష్ణుని దివ్య రూపాన్ని ఆవిష్కరించిన కళాకారులను వలువురు అభినందించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు డీసీపీ రాందాస్ తేజావత్, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనీ కుమారి, తెలంగాణ రీజినల్ డైలీ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ యూసఫ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ "భావయామి గోపాలం" కార్యక్రమం ఎంతో అద్భుతంగా సాగిందని ప్రశంసించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నేటి చిన్నారుల్లో కళల పట్ల ఆసక్తితో పాటు క్రమశిక్షణ, విలువలు పెంపొందుతాయని అన్నారు. నేటి కళాకారులే రేపటి భావితరాలకు ఆదర్శంగా నిలిచి, మంచి పౌరులుగా ఎదిగి, దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తారని ఆకాంక్షించారు.

నాట్యరత్న రాజనాల శ్రీదేవి

శ్రీ మయూరి నృత్యాలయ కళక్షేత్రంను స్థాపించి చిన్నారులకు భరతనాట్యం, కూచిపూడి శిక్షణతో మన భారతీయ నృత్య సంప్రదాయాలకు తనవంతు కృషి చేస్తున్నారని వక్తలు శ్రీదేవిని ప్రశంసించారు.

ఈ నృత్యోత్సవాన్ని ఆర్గనైజర్ రామ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ మయూరి నృత్యాలయ నిర్వాహకులు, నృత్య గురువులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములయ్యారు.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వీడియో జర్నలిస్టులకు పురస్కారాలు



సిద్దిపేట : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వీడియో జర్నలిస్టులకు పురస్కారాలు లభించాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన ఫ్రీడం ప్రెస్ క్లబ్ కార్యక్రమంలో ఈ బహుమతులను అందజేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వీడియో జర్నలిస్టులు సర్దేన నాగరాజ్, ముంజ గిరిబాబు (సిద్దిపేట) తమ ప్రతిభకు గుర్తింపుగా పురస్కారాలను అందుకున్నారు. జర్నలిజంలో తమ కెమెరా నైపుణ్యంతో విశేష సేవలు అందిస్తున్నందుకు వారిని ఈ సందర్భంగా అభినందించారు. పురస్కారాలు అందుకున్న సర్దేన నాగరాజ్, ముంజ గిరిబాబును ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. అలాగే కెమెరా డిపార్ట్‌మెంట్ హెడ్ శ్రీనివాస్ వారిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి-ఎంపి ఈటల

హైదరాబాద్,భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాను. ఊర్లలో తాతల ఆస్తులు అమ్ముకుని తిరిగేవాన్ని తిరుగుబోతు అనేవారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే పని చేస్తున్నారు. కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ ఏర్పడింది పేదలకు ఇళ్ళ జాగాలు ఇవ్వడానికి, వ్యాపారం చేయడానికి కాదు. రెండో తారీకు ఏర్పాటు చేసిన వేలంపాటను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు.సోమవారం అయన కూకట్ వల్లిలో మీడియాతో



మాట్లాడారు. ఈటల మాట్లాడుతూ నిజాం కాలంలో 1908లో వరదలు వచ్చినప్పుడు అనేక ఇళ్లు వరదల్లో కొట్టు పోయాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారు. "సిటీ ఇంప్రూవ్మెంట్ బోర్డ్" 1911 లో నిజాం ఏర్పాటు చేసి ప్రజలకు ఇల్లు కట్టించారు. 1931 లో "సికింద్రాబాద్ ఇంప్రూవ్మెంట్ బోర్డ్" ఏర్పాటు చేశారు. ఈ బోర్డ్ 1960 లో హౌసింగ్ బోర్డ్ గా మారింది. ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ భూములు కేటాయించడంతో పాటు రైతుల భూములు కూడా సేకరించారు. కూకట్పల్లి, కైతలాపూర్, హైదర్ నగర్ మూడు గ్రామాల పరిధిలో 1400 ఎకరాలు సేకరించారు. హౌసింగ్ బోర్డ్ ఉద్యోగులకు గజం 1 రూపాయి 25 పైసలకు ఇచ్చారు. ఆర్థిక స్తోమతను బట్టి కొనుక్కొనే విధంగా 66 గజాలు, 111 గజాలు, 311 గజాలు, 400 గజాలు ప్లాటింగ్ చేశారని అన్నారు.జేఎన్టీయూ ఔజ కోసం హౌసింగ్ బోర్డ్ 100 ఎకరాలు లీజుకు ఇచ్చారు. హౌసింగ్ బోర్డ్ ఏర్పడింది పేదవారి సొంత ఇంటి కలను నెరవేర్చడానికి తప్ప వ్యాపారం చేయడానికి కాదు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2005-06 లో కూకట్పల్లిలో భూముల అమ్మకాలు మొదలుపెట్టారు. మలేషియా టౌన్షిప్ కు 36 ఎకరాలు, హిందూ ప్రాజెక్ట్ కు 70 ఎకరాలు, లోధాకు 18 ఎకరాలు, ఇండీస్ వన్ సిటీకి 12 ఎకరాలు అమ్మారు. స్కూలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాలు, హాస్పిటల్ కట్టుకోవడానికి స్థలాలు కరువయ్యాయి. ఖాళీగా ఉన్న జాగాలను వీటికి కేటాయించండి కానీ అమ్ముకోవద్దు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి కూడా రిప్రజెంటేషన్ ఇచ్చాము. అయినా అమ్ముకుంటున్నారు. హౌసింగ్ బోర్డ్ చట్టం ప్రకారం పేదవారికి ఇళ్ళ జాగాలు ఇవ్వాలి తప్ప ఇలా అమ్ముకోవడానికి హక్కు లేదని అన్నారు.భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాను. బస్తీలలో పని చేసుకునేవారికి ఊరు అవతల డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తే.. అక్కడ పని లేక వారు.. చేపలను నీళ్లలో నుంచి బయట వేస్తే ఎలా కొట్టుకుని చచ్చిపోతాయో.. వారి పరిస్థితి కూడా అలానే ఉంది. ఎక్కడ ఉన్నవారికి అక్కడే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి ఇవ్వాలి. పేదవారికి కట్టించడానికి మనసు రావడం లేదా? పేదవారి కోసమైతే బడ్జెట్ లేదా ? ఇందిర రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అన్నది కేవలం స్లోగన్ గానే మిగిలిపోయిందని అన్నారు.

వసతి గృహాల్లో సకల సదుపాయాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పిస్తుందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ గోకుల్ నగర్ లోని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా వసతి గృహంలో ఉంటున్న విద్యార్థుల సంఖ్య గురించి ఆరా తీశారు, వారు ఎక్కడెక్కడి నుండి వచ్చారు,అలాగే వసతి గృహం లో ఉన్న సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు అనంతరం నీసీ కెమెరాల పనితీరును, వంటకు ఉపయోగించే పప్పు దినుసులు, బియ్యం, గుడ్ల నాణ్యత ను పరిశీలించి వాటి సరఫరా గురించిన వివరాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలకి వెళ్లి భోజన తయారీ తీరు గురించి తెలుసుకొని.... విద్యార్థులతో మాట్లాడుతూ... ఈరోజు ఎం టిఫిన్ పెట్టారు...రుచికరంగా ఉందా అని కలెక్టర్ ఆరా అడిగారు కిచెన్ షెడ్ మరమ్మత్తు పనుల పురోగతి ని తెలుసుకొని పలు సూచనలను కలెక్టర్ తెలుపుతూ....వాటర్ పోవడానికి డ్రైనేజి వ్యవస్థ బాగుండాలని... నీరు ఎక్కడ ఆగకుండా ఉండేలా చూడాలన్నారు.వర్షపు నీటి సంరక్షణకు కావాల్సిన చర్యలను చేపట్టాలన్నారు.తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించి.... వసతి గృహంలో పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని,వసతి గృహ నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని వార్డెన్ కి తెలియజేశారు. అలాగే విద్యార్థులు కూడా బాగా చదువుకోవాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా... సమయాన్ని వృధా చేయకుండా...ఒక లక్ష్యం పెట్టుకొని అందుకు తగ్గట్టు గా కష్టపడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్చార్జి బీసీ సంక్షేమ అధికారి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు

నవ కంటోన్మెంట్ నిర్మాణం లో భాగంగా క్లీన్ కంటోన్మెంట్ మిషన్: బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ బోర్డు జనరల్ బాడీ సమావేశం ఈరోజు బోర్డు కార్యాలయంలో బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని కంటోన్మెంట్ అభివృద్ధికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. తాను నియోజకవర్గంలో నవ కంటోన్మెంట్ నిర్మాణ బాట చేపట్టి పలు సమస్యలను గుర్తించానని, ముఖ్యంగా బోర్డు పరిధిలోని అన్ని వార్డులలో ఎక్కడికక్కడ చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వెంటనే క్లీన్ కంటోన్మెంట్ లక్ష్యంగా మిషన్ చేవట్టాలని సూచించారు.బ్రిగేడియర్, సి ఇ ఓ, నామినేటెడ్ మెంబర్ లు కూడా ఎమ్మెల్యే సూచనతో ఏకీభవించి వెంటనే క్లీన్ కంటోన్మెంట్ మిషన్ చేపడదామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి జఖఊఅ ల నిర్మాణానికి 6 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, రెండు చోట్ల ఔఅ లు కూడా బోర్డు మంజూరు చేసిందని, మిగిలిన వాటికి కూడా ఔఅ లను త్వరగా ఇస్తే వాటి నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు.

లండన్‌లోని 'ఇండియా డే ' వేడుకల్లో టాక్ తెలంగాణం..

స్టాల్ ప్రారంభించిన టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల

లండన్ : లండన్‌లోని భారత హై కమిషన్, భారతదేశానికి చెందిన వివిధ రాష్ట్రాల ప్రవాస సంఘాలతో సంయుక్తంగా భారత 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జరిపిన 'ఇండియా డే వేడుకల్లో' తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) (ఎంజఐ), తెలంగాణా రాష్ట్రానికి ప్రాతినిత్యం వహించింది. భారత హై కమిషనర్ పెరియాసామి కుమారన్ ముందుగా జెండా ఆవిష్కరించి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమయ్యింది. ముందుగా తెలంగాణ ప్రత్యేకతతో టాక్ సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్‌ను టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల ప్రారంభించడం జరిగింది. యూకే నలుమూలల నుండి వేలాదిమంది మంది ప్రవాస భారతీయులు ఈ వేడుకలకు హాజరయ్యారు.తెలంగాణ రాష్ట్ర ప్రాతినిధ్యం ఉట్టి పడేలా తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను, చరిత్రను, భాషా, సంస్కృతి, పర్యాటక ప్రత్యేకత, అభివృద్ధి ఇలా వీటన్నింటి సమాచారాన్ని స్టాల్ లో ప్రదర్శించి, హాజరైన వారందరికీ తెలంగాణ ప్రత్యేకత గురించి వివరించారు.స్టాల్ లో ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల, తెలంగాణా ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రాముఖ్యత, విశిష్టత గురించి వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులకు, ఇతర అతిథులకు తెలియజేయాలనే భావనతో, టాక్ సంస్థ ఆద్వర్యంలో తెలంగాణ ప్రముఖులు, సాధించిన విజాయాలతో కూడిన ప్రత్యేక "తెలంగాణా స్టాల్ " ని ఏర్పాటు చేయడం జరిగిందని సంస్థ ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు తెలిపారు.ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ కేవలం టాక్ సంస్థ మాత్రమే ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందని, వ్యక్తిగతంగా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ వాటన్నింటినీ పక్కన బెట్టి బాధ్యత గల సంస్థగా, తెలంగాణ బిడ్డలుగా ఇందులో భాగస్వములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, తెలంగాణ



ప్రత్యేక స్టాల్ నిర్వాహణకు కృషి చేసి సహకరించిన కార్యవర్గ సభ్యులకు టాక్ ఈవెంట్స్ ఇంచార్జి మల్లా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్టాల్ ను సందర్శించిన ప్రముఖులకు, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులకు టాక్ ఉపాధ్యక్షుడు సురేష్ బుడగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణా సంస్కృతి ? సాంప్రదాయాలు, తెలంగాణ విజయాలు, పర్యాటక ప్రత్యేకత, చాలా గొప్పగా ఉందని, నూతన రాష్ట్ర సంస్కృతిని, గొప్పతన్నాని, ప్రపంచానికి చూపెట్టాలనే ప్రయత్నం చాలా స్ఫూర్తి దాయకంగా ఉందని హాజరైన ప్రవాస భారతీయులు ప్రశంసించారు. ప్రవాస తెలంగాణా బిడ్డలు స్టాల్ ని సందర్శించి తెలంగాణకు ప్రత్యేక స్టాల్ ని చూడడం చాలాగర్వంగా ఉందని, తెలంగాణా ప్రాముఖ్యతను ప్రదర్శిస్తున్న తీరుని అభినందించారు. ఫోటోలతో, సెల్ఫీలతో టాక్ సంస్థ స్టాల్ సందడిగా మారింది. 'తెలంగాణా స్టాల్'ని సందర్శించిన అతిథులందరికి మన 'హైదరాబాద్ బిర్యానీ' రుచి చూపించడం జరిగిందని టాక్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ జెల్ల తెలిపారు.ఈ కార్యక్రమంలో టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, కార్యవర్గ సభ్యులు సురేష్ బుడగం,రాకేష్ పటేల్, సుప్రజ పులుసు, శ్రీకాంత్ జెల్ల, పవిత్ర , నవీన్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి,మల్లా రెడ్డి,వెంకట్ రెడ్డి, స్వాతి,సత్యం కంది,హరి గౌడ్, క్రాంతి రేతినేని, రవి పులుసు,శ్రీ లక్ష్మి, సందీప్, సాయి కిరణ్ కనుగుల, అబ్దుల్ ఖుద్దూస్, అద్విత్ కంది, పావని, తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

కావేరీ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ..

తమిళనాడుకు కీలక సూచన..

కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న కావేరీ జల వివాదంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక సూచనలు చేసింది. కర్ణాటక నుంచి తమకు రావాల్సిన కావేరీ నీటి వాటా సక్రమంగా అందడం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సమస్యపై ముందుగా కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థ (అచిఓం)ను ఆశ్రయించాలని తమిళనాడుకు సుప్రీంకోర్టు సూచించిందిజస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం తమిళనాడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. కర్ణాటక నుంచి తమకు దామాషా ప్రకారం రావాల్సిన నీరు విడుదల కావడం లేదని తమిళనాడు తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. నీటి పంపిణీ, విడుదలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థను ముందుగా ఆశ్రయించాలని తమిళనాడుకు సూచించింది వర్షాభావం కారణంగా నీటి నిల్వలు తగ్గాయని కర్ణాటక చెబుతోంది. అయినా తమకు రావాల్సిన న్యాయమైన వాటా నీటిని విడుదల చేయాలని తమిళనాడు పట్టుపడుతోంది ఈ విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే సీడబ్ల్యూఎమ్ఏ ద్వారానే ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. సాంకేతిక లెక్కింపులు, నీటి నిల్వల ఆధారంగా సీడబ్ల్యూఎమ్ఏ తుది నిర్ణయం తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.



బిహార్ మధేపురాలోని సింఘేశ్వర ఆలయం వద్ద తోపులాట.. భక్తులకు గాయాలు..

బిహార్: మధేపురాలోని సింఘేశ్వర ఆలయం వద్ద ఉదయం తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. శ్రావణ సోమవారం కావడంతో సింఘేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అయితే, భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు ఏర్పాటు చేసిన ఓ బారికేడ్ అకస్మాత్తుగా కూలిపోయింది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.వెంటనే తొక్కిసలాట వంటి పరిస్థితి నెలకొంది. ఒకరినొకరు తోసుకోవడంతో సుమారు ఆరుగురు భక్తులు గాయపడ్డారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం మధేపురాలోని జననాయక్ కర్పూరి ఠాకూర్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అయితే, ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ, మేజిస్ట్రేట్ అభిషేక్ రంజన్ సహా ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరోవైపు, అదనపు బలగాలను కూడా మోహరించారు. పరిస్థితిని వెంటనే అదుపులోకి తీసుకువచ్చారు. అధికారులు నిర్దేశించిన మార్గదర్శకాలను భక్తులు పాటించాలని, ప్రశాంతంగా ఉండాలని ఆలయ ట్రస్ట్ కమిటీ కోరింది.కాగా, గత సోమవారం లఖిసరాయ్ జిల్లాలోని అశోక్ ధామ్ ఆలయం వద్ద తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. భారీ జనసందోహానికి తోడు విద్యుత్ స్తంభం కూలిపోయిందనే వదంతి కారణంగా తొక్కిసలాట జరిగినట్లు అధికారులు తెలిపారు.



ఇస్రోను మోదీ సర్కార్ బలహీనపరుస్తోంది.. జైరామ్ రమేష్ సంచలన ఆరోపణలు..

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో భవితవ్యంపై రాజకీయ దుమారం మొదలైంది. ఇస్రోను మోదీ సర్కారు బలహీనపరుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరామ్ రమేష్ ఆరోపించారు. ఆరు దశాబ్దాలుగా ఇస్రో నిర్మించుకున్న సామర్థ్యాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారుఇస్రో భవిష్యత్ పాత్రకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. రాకెట్ల తయారీ, ప్రయోగ వాహనాల ఉత్పత్తిలో ఇస్రో పాత్రను గణనీయంగా తగ్గించి, ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించే దిశగా ప్రభుత్వం వెళ్తోందని ఆయన ఆరోపించారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల కృషితో ఇస్రో ఆరు దశాబ్దాలుగా అభివృద్ధి చేసుకున్న సామర్థ్యాలను, మౌలిక వసతులను ప్రైవేట్ రంగానికి అప్పగించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రైవేట్ అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సమావేశమమయ్యారు. ప్రపంచ స్థాయి ప్రతిభను భారత్‌కు ఆకర్షించేలా బలమైన అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని పిలుపునిచ్చారు అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇస్రో క్రమంగా ప్రయోగ వాహనాల తయారీ, సాధారణ ఉపగ్రహాల తయారీ నుంచి దూరమవుతున్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

సారంపల్లి మల్లారెడ్డి మరణంపట్ల బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ సంతాపం



అఖిలభారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మరణంపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్సంతాపం ప్రకటించారు. సారంపల్లి.. రైతాంగ సమస్యలపై, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం, తన జీవితకాలం పోరాటం చేసిన నిబద్ధత కలిగిన రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కొనియాడారు.సారంపల్లి మరణం భారత రైతాంగ ఉద్యమానికి తీరని లోటని కేసీఆర్ అన్నారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. వారి కుటుంబసభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు

సౌకర్యాల లేమితో నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు



బూర్గంపహాడ్, ఆగస్టు 24 : బూర్గంపహాడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయని సీపీఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాసరావు, వీబీ.చారి, సింగనబోయిన వెంకటేశ్వర్లు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఐటీసీ సహకారంతో లక్షల రూపాయలతో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిత్యం వందలాది మంది ప్రయాణీకులు తాసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి పోతుంటారని, అత్యవసర సమయంలో మూత్ర విసర్జన చేయాలంటే మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా సౌకర్యాలు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా మరుగుదొడ్లను వాడకంలోకి తెచ్చి నీటి సదుపాయం, ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మిస్ యూనివర్స్ ఇండియా 2026: విజేతగా 19 ఏళ్ల కేరళ కుట్టి

కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. జైపూర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి ఆమె విజేతగా నిలిచారు. దీంతో నవంబర్‌లో పోర్టో రికోలో జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున ఆమె బరిలోకి దిగనున్నారు.కాజియా స్వస్థలం కేరళ అయినప్పటికీ ఆమె బాల్యం ఎక్కువగా యూఏఈలోని అబుదాబిలో గడిచింది. ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో ఆమె విద్యాభ్యాసం సాగింది. పేజెంట్రీతో పాటు కాజియాకు కళలపై కూడా ఆసక్తి ఉంది. 12 ఏళ్ల పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. గాయని, సంగీత కళాకారిణిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. డ్రమ్స్, వయోలిన్ వాయించగలరు. పబ్లిక్ స్పీకింగ్, నటనలోనూ అనుభవం ఉంది. మలయాళ చిత్రం 'షైలాక్' ద్వారా నటిగా కూడా అరంగేట్రం చేశారు.కేరళకు చెందిన కాజియా ప్రస్తుతం లా చదువుతూనే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. చిన్న వయసులోనే అందాల పోటీల్లో తన సత్తా చాటుతున్నారు. 17 ఏళ్ల వయసులో మిస్ టీన్ దివా 2024 టైటిల్‌ను గెలుచుకున్నారు. అనంతరం 2025 మిస్ టీన్ ఇంటర్నేషనల్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది జరిగిన మిస్ యూనివర్స్ కేరళ 2026 పోటీల్లో విజేతగా నిలిచి.. ఆ టైటిల్‌ను గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఏకంగా మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని దక్కించుకోవడం విశేషం.మిస్ యూనివర్స్ ఇండియా 2026 గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులు పోటీ పడగా.. కజియా లిజ్ మేజో విజేతగా నిలిచారు. తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ ఫస్ట్ రన్నరప్‌గా నిలవగా, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవ్లేకర్ సెకండ్ రన్నరప్‌గా ఎంపికయ్యారు. అంతేకాకుండా అనుశ్రీకి మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ కూడా దక్కింది. ఈ ఫినాలేకు మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో పాటు మాజీ మిస్ యూనివర్స్ ఇండియా విజేతలు ఊర్వశి రౌతేలా, సెలీనా జైట్లీ తదితరులు జడ్జీలుగా వ్యవహరించారు.



ఏపీలో ఫ్రెండ్లీ పోటీ తప్పదా

విజయవాడ, ఆగస్టు 24, రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా?రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా ఉన్న స్థానిక వర్గ పోరాటాలు, వ్యక్తిగత పట్టు ఈ ప్రక్రియను సంక్లిష్టం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నాయకుడూ తన సొంత ఉనికిని కాపాడుకోవాలని భావించడం వల్ల పార్టీ అధిష్ఠానాల నిర్ణయాలకు లోబడి సీట్లను త్యాగం చేయడం క్షేత్రస్థాయి కేడర్‌కు కష్టతరంగా మారుతోంది.గ్రామ రాజకీయాల్లో దశాబ్దాలుగా ఉన్న స్థానిక ఆధిపత్య పోరాటాలు కూటమి ఐక్యతకు ప్రధాన పరీక్షగా మారాయి. ఒకే పంచాయతీ లేదా వార్డులో టీడీపీ, జనసేన పార్టీల నుంచి బలమైన నాయకులు ఉండటం వల్ల, ఏ ఒక్కరికి టికెట్ ఇచ్చినా రెండో వర్గంలో తీవ్ర అసంతృప్తి చెలరేగే అవకాశం ఉంది. గ్రామాల్లో తమ ఉనికి కోల్పోతే భవిష్యత్ రాజకీయ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని కింది స్థాయి నాయకులు ఆందోళన చెందుతున్నారు. అధిష్ఠానం ఒత్తిడి తెచ్చినా స్థానికంగా సర్దుబాటు కావడం అసాధ్యమని భావించే ప్రాంతాల్లో స్వతంత్రులుగానైనా బరిలోకి దిగాలనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.అధికారికంగా ఒకే అభ్యర్థిని బలవంతంగా రుద్దడం కంటే స్నేహపూర్వక పోటీలు ఖాయంగా కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ చిహ్నాల ప్రాతిపదికన జరగకపోవడం కూడా క్షేత్రస్థాయి నాయకులకు తమ వ్యక్తిగత బలాన్ని నిరూపించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. రెండు కూటమి పార్టీల నేతలు బరిలో ఉన్నప్పటికీ, ప్రచారంలో హద్దులు దాటకుండా విపక్ష వైఎస్సార్‌సీపీకి మైలేజ్ రాకుండా చూసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.కూటమి అధిష్ఠానానికి స్థానిక సమన్వయం అతిపెద్ద పరీక్షగా నిలవనుంది. సమన్వయ కమిటీల ద్వారా సర్దుబాటు ప్రక్రియను ముందస్తుగానే పూర్తి చేయడం, నామినేటెడ్ లేదా ఇతర స్థానిక పదవుల హామీలతో అసంతృప్త నేతలను బుజ్జగించడంపై నాయకత్వం దృష్టి సారించింది. కింది స్థాయిలో ఘర్షణ వాతావరణం ఏర్పడితే అది ప్రభుత్వంపై ఉన్న సానుకూలతను ప్రభావితం చేస్తుందనే భావనతో, ప్రతి నియోజకవర్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా రంగంలోకి దిగి సర్దుబాటు చేసే ప్రయత్నాలు గట్టిగా చేయాల్సి ఉంది.

ఏపీలో ఏకంగా 10 వేల పోస్టులు

విజయవాడ, ఆగస్టు 24, ఏపీ ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. 2026 జాబ్ క్యాలెండర్ కింద రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పోస్టులను ఒకేసారి కాకుండా అభ్యర్థుల సౌలభ్యం, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా నాలుగు విడతల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఏపీ ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. 2026 జాబ్ క్యాలెండర్ కింద రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పోస్టులను ఒకేసారి కాకుండా అభ్యర్థుల సౌలభ్యం, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా నాలుగు విడతల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలి విడతలో 1523 పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయ్యింది. అయితే ఇది నిరుద్యోగులకు ఒక సువర్ణ అవకాశం. ఇప్పటికే మరో డీఎస్సీకి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ప్రభుత్వ శాఖల్లో 10 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించడం మాత్రం శుభపరిణామం.పదివేల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రక్రియలో భాగంగా.. రెండో దశ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 3231 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. వీటిలో అత్యంత కీలకమైన గ్రూపు 1 కేటగిరీలో 149 పోస్టులు ఉన్నాయి. మరోవైపు పోలీస్ విభాగంలో భారీ ఉద్యోగాల భర్తీ జరగనుంది. ఇందులో 542 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో పాటు 152 సివిల్ ఎస్ఐ పోస్టులు ఉన్నాయి. ఇక మూడో దశ నోటిఫికేషన్ ను అక్టోబర్ 15న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏకంగా 2311 ఉద్యోగాలను భర్తీ చేయనుండగా.. ఇందులో గ్రూప్ 2 కేటగిరి కింద 673 పోస్టులు ఉన్నాయి. ఇందులో అత్యంత కీలకమైన డిప్యూటీ తహసిల్దార్ పోస్టులు 200 వరకు ఉన్నాయి. వీటితో పాటు వివిధ ఇంజనీరింగ్ సర్వీసులు, ఇతర సాంకేతిక, పరిపాలన విభాగాల్లో 1638 పోస్టులను కూడా మూడో దశలో నోటిఫై చేయనున్నారు.మరోవైపు అక్టోబరు 15న నాలుగో దశ కింద 2995 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ కానుంది. ఈసారి విద్యాశాఖలో ఎక్కువ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఒక్క స్కూల్ ఎడ్యుకేషన్ విభాగంలోనే ఏకంగా 2,991 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇలా ఏకకాలంలో గ్రూప్స్, పోలీస్, ఇంజనీరింగ్, ఉపాధ్యాయ కొలువుల భర్తీకి స్పష్టమైన షెడ్యూల్ తో ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో ఆనందం నెలకొంది. మరోవైపు డీఎస్సీ 2026 కు కూడా ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. అక్టోబర్లో డీఎస్సీ ప్రకటనకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. అయితే వరుసగా ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వం పట్ల సంతృప్తి నెలకొంది.

సఫిక్ ఖాన్ ను కాకినాడకు తెచ్చిన పోలీసులు

కాకినాడ,కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితుడు సాధిక్ ఖాన్ను ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న కాకినాడ జిల్లా పోలీసులు, ఢిల్లీ నుంచి రైలులో సాధిక్ ఖాన్ను కాకినాడకు తరలించారు. రైలు సామర్లకోటలో కాకుండా జి.మేడపాడు వద్ద ఆగడంతో అక్కడే సాధిక్ను దింపారు. జి.మేడపాడు నుంచి వాహనంలో కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్ స్టేషన్కు తరలించారు. సాధిక్ ఖాన్ను తీసుకొచ్చే క్రమంలో పోలీసులు అత్యంత గోప్యత పాటించినట్లు సమాచారం. ప్రస్తుతం సాధిక్ ఖాన్ను అడిషనల్ ఎస్పీ కిషోర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. విచారణలో ఆరుగురు సీఐలు పాల్గొంటున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించి సాధిక్ ఖాన్ను విచారిస్తున్నారు.

టూ, త్రీ సిటీస్ లో హోమ్ స్టేలు

విజయవాడ, ఆగస్టు 24, ఏపీ ప్రభుత్వం వినూత్న ఆలోచన చేస్తోంది. పట్టణాల్లో హోమ్ స్టేలను తీసుకువచ్చే ఆలోచనలో ఉంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ హోం స్టేలను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు నిర్ణయించింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. పట్టణాల్లో హోం స్టేలను గుర్తించే పనిలో ఉన్నారు అధికారులు. ఎవరికైనా ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. సాధారణంగా పట్టణాలకు పనులపై వచ్చేవారు ఉంటారు. నగరాలకు సంబంధించి సందర్శనకు, ఆలయాలకు, పర్యటనల కోసం వస్తుంటారు. అటువంటి వారికి తక్కువ ఖర్చుతో వసతితో పాటు భోజనం అందించేలా ఈ హోమ్ స్టేలను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధపడుతోంది ఏపీ ప్రభుత్వం. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచేలా ఏర్పాట్లు చేస్తోంది.విశాఖ నగరాన్ని తీసుకుందాం. ఇక్కడకు చాలామంది పర్యాటకులు వస్తుంటారు. వారికి సరైన వసతి ఎక్కడ దొరుకుతుందో తెలియదు. అందుకే అధిక ధర వెచ్చించి హోటల్ గదుల్లో దిగుతుంటారు. అటువంటి వారికి ఇబ్బంది లేకుండా ఈ హోం స్టేలను అందుబాటులోకి తెస్తే బాగుంటుంది అనేది రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం. మరోవైపు సంక్రాంతి సంబరాల సమయంలోనూ వేలాది మంది ఇతర ప్రాంతాల నుంచి గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అక్కడే ఉండి సంక్రాంతి వేడుకలను తిలకిస్తుంటారు. అయితే బంధుమిత్రులు ఉన్నవారు పర్వాలేదు కానీ.. లేని వారికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అటువంటి సమయంలో ఈ హోం స్టేలు అనేవి ఎంతగానో దోహదపడతాయి. సాధారణంగా ప్రముఖ ఆలయాలు సైతం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. వాటిని సందర్శించే సమయంలో సైతం వసతి సమస్య ఏర్పడుతుంది. అటువంటి వారికి సైతం హోమ్ స్టేలు ఎంతగానో ఉపయోగపడతాయి.తక్కువ ధరకు పర్యాటకులకు వసతి కల్పించడంతో పాటు.. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలి అనేది ఈ హోం స్టేల ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పట్టణ మహిళా సంఘాలు ఆధ్వర్యంలో పట్టణాల్లో హోం స్టేలు సిద్ధం చేసేలా కసరత్తు జరుగుతోంది. అయితే స్థానికంగా ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు వారికి వివరించేలా బాధ్యతను కూడా అప్పగిస్తారు. ఎక్కడో అద్దెకు ఉన్నాం అన్న భావన లేకుండా.. అతిథులు మాదిరిగా ఆతిథ్యం పొందే వీలుగా ఈ హోం స్టేలు ఏర్పాటు చేయనున్నారు. ఎవరైనా ఆసక్తి ఉండి దరఖాస్తు చేసుకుంటే ముందుగా ఆ ఇళ్లను అధికారులు పరిశీలిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారి సత్ప్రవర్తన కూడా పరిశీలించనున్నారు. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు కూడా ఉండకూడదు. అలాగే అతిథులకు సదుపాయాలు, గౌరవంగా వ్యవహరించడం వంటి అంశాలపై నిర్వాహకులకు శిక్షణ ఇవ్వనున్నారు హోమ్ స్టేకు కనీసం ఒక బెడ్ రూమ్ రెండు పడకలతో.. గరిష్టంగా ఆరుగదులు 12 బెడ్లతో ఉండాలి. సదరు ఇంటి యజమాని తన కుటుంబంతో అదే ప్రాంతంలో నివాసం ఉండాలి. ఒకవేళ అనుబంధంగా ఉండే బెడ్, బ్రేక్ ఫాస్ట్ కోసం యజమాని, ప్రమోటర్ అదే ప్రాంతంలో నివా నివాసం ఉండాల్సిన అవసరం లేదు. అటువంటి వారు అతిథులకు అవసరం అయినా సేవలు అందించేందుకు ఒక ప్రతినిధిని నియమించుకోవాల్సి ఉంటుంది. కాగా దాదాపు అన్ని ప్రముఖ పట్టణాల్లో మెప్మా అధికారులు అప్పుడే కసరత్తు ప్రారంభించారు.

స్థానిక ఎన్నికల్లో వైసిపి వారసులు..

గుంటూరు, ఆగస్టు 24,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. అక్కడ పార్టీ పరిస్థితి మెరుగుపడిందా? పర్వాలేదు. లేకుంటే పార్టీని వదిలి సేఫ్ జోన్ లో తమ వారసులను నిలపాలన్న ఆలోచనతో ఉన్నట్లు కనిపిస్తోంది. 2029 ఎన్నికలు దాటితే చాలామంది ఏడుపదుల వయసు దాటుతారు. అప్పటికి తమ వారసుల రాజకీయ భవిష్యత్తు సెట్ అవుతుందా? లేదా? అనే అనుమానంతో ఉన్నారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలుగా ధర్మాన బ్రదర్స్, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాం లాంటి నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే తమ పిల్లలకు టికెట్లు ఇవ్వాలని ధర్మాన బ్రదర్స్ కోరారు. కానీ అందుకు జగన్ అంగీకరించలేదు. అయితే ఇప్పుడు 2029 ఎన్నికల వరకు వేచి చూసే కంటే.. స్థానిక ఎన్నికల్లోనే తమ పిల్లలను బరిలో దించాలని ధర్మాన బ్రదర్స్ చూస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మాన కృష్ణ దాస్ కుమారుడిని జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. ధర్మాన ప్రసాదరావు కుమారుడ్ని శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ గాను రంగంలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అక్కడ వచ్చే ఓట్ల ప్రభావం, ఫలితాలను అంచనా వేసుకుని 2029 ఎన్నికల నాటికి ఏదో ఒక రాజకీయ నిర్ణయం తీసుకోవాలన్నది ధర్మాన బ్రదర్స్ ఆలోచనగా తెలుస్తోంది.శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. ప్రస్తుతం ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అయినా సరే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దానికి కారణం వారసులను రాజకీయంగా సెట్ చేయడమే. కుమార్తెతో పాటు కుమారుడు ఇద్దరూ వైద్యులే. కానీ ఇంతవరకు వారు పొలిటికల్ గా సెట్ కాలేదు. అందుకే తన కుమార్తె డాక్టర్ అనూషను జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. కుమారుడు సందీప్ ను చీపురుపల్లి ఎమ్మెల్యే గారు చూడాలనుకుంటున్నారు బొత్స. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో తన కుమార్తె పేరును జిల్లా పరిషత్ చైర్పర్సన్ పదవి కోసం జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. మరోవైపు తాను ఎంపీగా పోటీ చేయాలనుకుంటే తన కుమారుడికి జిల్లా పరిషత్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు తమ్మినేని. అయితే ఈ సీనియర్లంతా అంతిమంగా ఒకటే ఆలోచన చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఓట్లు, గ్రాఫ్ పెరిగితే పరవాలేదు.. లేకుంటే మాత్రం పార్టీ నుంచి బయటకు వెళ్ళిపోవడమనే నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..



రోడ్ల మీద గ్రీన్ ఈవీ బస్సు

తిరుపతి, ఆగస్టు 24, ఏపీఎస్ఆర్టీసీ కన్వెర్షన్ ఏసీ ఇంద్ర బస్సు రోడ్డెక్కింది. పుణెకు చెందిన కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ సంస్థ పాత సూపర్ లగ్జరీ బస్సును విజయవాడలోని వర్క్‌షాప్‌లో విద్యుత్ బస్సుగా మార్చింది. విజయవాడతో పాటుగా తిరుపతిలో పలు దశల్లో ట్రయల్ రన్ నిర్వహించారు.. తాజాగా ఈ గ్రీన్ ఇంద్ర ఏసీ విద్యుత్ బస్సును తిరుపతి నుంచి కాణిపాకానికి నడిపింది. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలవుతోంది.. దీంతో బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగింది. ఈ కారణంగా అదనంగా బస్సులు అవసరమయ్యాయి.. కేంద్రం సహకారంతో రాష్ట్రానికి విద్యుత్ బస్సులు విడతలవారీగా వస్తున్నాయి. కొత్త బస్సులతో పాటుగా ఏపీ ఎన్ఆర్టీసీ మరో వినూత్నమైన ఆలోచన చేసింది.. పాత బస్సుల్ని ఏసీ ఈవీ బస్సులుగా మారుస్తోంది. పాత సూపర్‌లగ్జరీ బస్సును పుణెకు చెందిన కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ సంస్థ తక్కువ ఖర్చుతో రెట్రోఫిట్మెంట్ ద్వారా గ్రీన్ ఇంద్ర ఏసీ విద్యుత్ బస్సుగా మార్చేశారు. ఈ బస్సును తిరుపతి నుంచి కాణిపాకానికి అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ విద్యుత్ బస్సు రెండు నెలల క్రితం విజయవాడ నుంచి తిరుపతికి తీసుకొచ్చారు. అనంతరం బస్సుకు సంబంధించిన రిజిస్ట్రేషన్, రోడ్డు కన్వెర్షన్ సహా అవసరమైన అనుమతులు తీసుకున్నారు. జులై 24న ఈ బస్సును తిరుపతి నుంచి కాణిపాకం ట్రయల్ రన్ నిర్వహించారు.. ఆ తర్వాత బస్సును రెగ్యులర్ సర్వీసుగా ప్రారంభించాలని భావించారు. కానీ ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వస్తోంది.. దీంతో ఆర్టీసీ అధికారులు ఈ బస్సు డిపోలో ఖాళీగా ఉంటుందని గమనించారు. ఇలా ఖాళీగా ఉంచే బదులు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తే మంచిదని భావించారు.ఈ నెల 16న కాణిపాకానికి ఈ బస్సు రెండు ట్రిప్పులు నడిచింది.. ఆ సమయంలో కొన్ని లోపాలు గుర్తించారు. ఈ నెల 17న ఈ బస్సును గ్యారేజీకి తీసుకెళ్లి లోపాలను సరిచేశారు. ఈ విద్యుత్ బస్సు మంగళవారం రోజు తిరుపతి నుంచి కాణిపాకానికి 22మంది ప్రయాణికులతో బయలదేరి వెళ్లింది. అనంతరం కాణిపాక నుంచి చిత్తూరు వెళ్లి అక్కడ అవసరమైన కొన్ని తనిఖీలు చేసిన తర్వాత మళ్లీ 20మంది ప్రయాణికులతో తిరుపతి చేరుకుంది. మొత్తం మీద ఏపీఎస్ఆర్టీసీ చేసిన ప్రయోగం విజయవంతం అయ్యింది. గ్రీన్ ఇంద్ర ఏసీ బస్సు అందరిని ఆకట్టుకుంటోంది.పాత సూపర్ లగ్జరీ బస్సును విజయవాడలోని వర్క్‌షాప్‌కు తరలించి విద్యుత్ బస్సుకు అవసరమైన మార్పులు చేశారు. రూ.90 లక్షలతో గ్రీన్ ఇంద్ర బస్సుగా మార్చారు. విజయవాడలోనే అవసరమైనన అన్ని ట్రయల్ రన్స్ నిర్వహించారు. అనంతరం ఈ ఏడాది జూన్ నెలలో ఈ బస్సును విజయవాడ నుంచి తిరుపతికి పంపించి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ బస్సు గంటన్నరలోనే ఛార్జ్ అవుతుంది.. గంటకు 80 కిలోమీటర్ల వేగంతో వెళుతుంది. పాత బస్సుల్ని అలా వదిలేయకుండా ఇలా విద్యుత్ బస్సులుగా మారిస్తే బావుంటుందనే ఆలోచన చేస్తున్నారు. మొత్తం మీద ఆర్టీసీ గ్రీన్ ఇంద్ర బస్సు అందుబా?టులోకి వచ్చింది.



టెంపుల్స్ కు అనుసంధాన రోడ్లు

నెల్లూరు, ఆగస్టు 24,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో.. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు రోడ్ల అనుసంధాన ప్రక్రియ వేగంగా జరుగుతోంది. రాష్ట్రంలోని100కుపైగా ప్రధాన క్షేత్రాలకు గ్రామీణ రోడ్ల అనుసంధానం చేపడుతున్నారు. రూ.120 కోట్లతో 205 కిలోమీటర్ల పొడుగున ప్రధాన ఆలయాలకు అనుసంధాన రహదారులు నిర్మిస్తున్నారు. ఐ.ఎస్.జగన్నాథపురం, అహోబిలం వంటి క్షేత్రాలకు గ్రామీణ రహదారులను అనుసంధానిస్తు?న్నారు. వీటిలో 40 శాతం రోడ్లు ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు దేవాలయాలకు రహదారుల నిర్మాణం జరుగుతోంది. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో సరైన రహదారి సౌకర్యం లేని దేవాలయాలను ఆయన గుర్తించారు. కొన్ని ఆలయాల దుస్థితిని ప్రజలు వినతపత్రాల రూపంలో పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో దేవుని దర్శనానికి వెళ్లే దారి లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని పవన్ కళ్యాణ్ సంకల్పించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా వందకు పైగా ప్రధాన క్షేత్రాలను 205 కిలోమీటర్ల పొడుగున రోడ్లతో అనుసంధానించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ నిధులతో వీటి నిర్మాణం చేపడుతున్నారు.శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి అనుసంధాన రోడ్ల నిర్మాణానికి పవన్ కళ్యాణ్ రూ.30 కోట్లు కేటాయించారు. ఈ పనులు అత్యంత వేగంగా పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు.. రూ. 120 కోట్ల వ్యయంతో రహదారులు నిర్మిస్తు?న్నారు. వీటిలో ఇప్పటికే 26 శాతం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభం కోసం సిద్ధంగా ఉన్నాయి. మరో 40 శాతం రహదారులు యాభై శాతం పనులు పూర్తి చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.అంతర్వేది, అహోబిలం, మదనపల్లి గట్టు వెంకటరమణ స్వామి ఆలయం,దేవరాయ సల్లగంగమ్మ ఆలయం, పుడియగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం ఘాట్ రోడ్డు, సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని సింగిరికోన, సోమేశ్వరం తలుపులమ్మలోవ మార్గం, ఐ.ఎస్ జగన్నాథపురం ఘాట్ రోడ్లు నిర్మాణం పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాస్కీ నిధులతో చేపట్టిన వివిధ రహదారుల పనులు వివిధ స్థాయిల్లో పురోగతిలో ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో దాదాపు 72 కిలోమీటర్ల రోడ్లు సైతం వివిధ దశల్లో సనులు కొనసాగుతున్నాయి.పుణ్య క్షేత్రాలకు వెళ్ళే రోడ్ల నాణ్యతా ప్రమాణాల విషయంలో శ్రద్ధ వహించాలని పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖ నిర్మించే రోడ్లు భక్తులకు సుదీర్ఘ కాలం ఉపయోగపడాలని సూచించారు. క్షేత్ర స్థాయి పర్యటనల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆలయాల రోడ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించి, భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

:ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం లో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవ స్వామి దేశాయ్

నందవరం,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు శాసనసభ్యులు గౌరవనీయులు డాక్టర్ బి.వి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మరియు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేశాయ్ మాధవరావు నందవరం గ్రామ అధ్యక్షులు దేవల భీమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 45 రోజుల ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో నందవరం మండలం నందవరం గ్రామ లో బిసి కాలనీ లో 35 బూత్ లో ఇంచార్జీ మోహన్ ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ,కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి,ప్రజలకు అందించిన సంక్షేమ ఫలితాలను వివరించారు.ఈ సందర్భంలో గ్రామంలో ఒక హోటల్లో జరిగిన సంఘటన గతంలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆ హోటల్ కి రావడంతో టిఫిన్ చేసినాడు అని గతంలో ప్రభుత్వం మాకు కులాయి కేటాయించలేదు అని ఆ హోటల్ యజమాని వాళ్ళు తెలియజేయడం జరిగింది మాకు దయచేసి ఈ ప్రభుత్వంలో మాకు కొళాయిన కేటాయించాలని హోటల్ యజమాని బాధాకరంగా తెలియజేశారు కుటుంబానికి ఇంటింటా తెలుగుదేశం కరపత్రాలను అందజేస్తూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమం ఈ కార్యక్రమంలో పాల్గొన్న బూత్ ఇంచార్జ్ లో బెస్ట్ ఈరన్న డీలర్ మల్లికార్జున వెంకటేశ్వర్లు డాక్టర్ శ్రీనివాసులుచిన్నపోతప్ప,మోహన్,వడ్డే మురళి మండల నాయకులు మరియు యువ నాయకులు గ్రామ నాయకులు కార్యకర్తలు తదుపరి పాల్గొన్నారు.

గన్నవరంలో ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం

గన్నవరం,గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్. రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బోడే ప్రసాద్, వర్ల కుమార్ రాజా, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. తరువాత ఉప రాష్ట్రపతి గన్నవరం నుంచి నూజివీడు నియోజకవర్గం ముసునూరు బయలుదేరారు.


స్పోర్ట్స్ గుర్తాన్

ఓడినప్పటికీ చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ బౌలర్



మోకే వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ ఘోర ఓటమిని చవిచూసిన సంగతి తెలిసిందే. ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో బంగ్లా ఓటమి పాలైంది. ఇదే సమయంలో ఆ జట్టు ఎడమచేతి వాటం పేసర్ షోరిఫుల్ ఇస్లామ్ అరుదైన రికార్డు సాధించాడు. అద్భుత బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్‌ను షోరిఫుల్ దెబ్బ తీశాడు. ఈ పేసర్ 15 ఓవర్లలో 48 పరుగులే ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. దీంతో 140 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో కంగారు జట్టుపై ఒక ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీసిన తొలి ఎడమ చేతి వాట పేసర్‌గా షోరిఫుల్ నిలిచాడు.గతంలో ఇంగ్లండ్‌కు చెందిన ఎడమ చేతి వాటం పేసర్ డిక్ బార్లో ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీశాడు. 1886లో మాంచెస్టర్‌లో జరిగిన టెస్టులో బార్లో 44 పరుగులే ఇచ్చి.. 7 వికెట్లు సాధించాడు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఏ ఎడమచేతి వాటం పేసర్ కూడా ఆస్ట్రేలియాపై ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లను సాధించలేదు. 140 ఏళ్ల తర్వాత తాజాగా షోరిఫుల్ ఇస్లామ్ ఆ అరుదైన ఫీట్‌ను సాధించాడు.అయితే ఆస్ట్రేలియాపై టెస్టుల్లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకం మాత్రం ఇంగ్లండ్ దిగ్గజం జిమ్ లేకర్ పేరిట ఉంది. 1956 జూలైలో మాంచెస్టర్‌లో జరిగిన టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో లేకర్ మొత్తం 10 మంది కంగారు బ్యాటర్లను కేవలం 53 పరుగులకే ఔట్ చేశాడు. మరోవైపు షోరిఫుల్ అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో బంగ్లా దారుణ ఓటమిని చవిచూసింది. దీంతో రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్ 1-1తో ముగిసింది.

కుల్దీప్ యాదవ్ గైర్హాజరీపై క్లారిటీ ఇచ్చిన కోటక్!



శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టుకు భారత స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ దూరమయ్యాడు. అయితే అతడి గైర్హాజరీపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ క్లారిటీ ఇచ్చాడు. ఆరోగ్య సమస్య వల్లే రెండో టెస్టుకు కుల్దీప్ దూరమయ్యాడని కోటక్ స్పష్టం చేశాడు. మ్యాచ్‌కు ముందు కుల్దీప్ ఫిట్‌నెస్, గైర్హాజరీపై పలు ఊహాగానాలు రాగా.. కోటక్ వాటిని ఖండించాడు. యాదవ్‌ను తుది జట్టు నుంచి తప్పించడానికి మేనేజ్‌మెంట్ ఎలాంటి అనవసర నాటకాలు ఆడాల్సిన అవసరం లేదన్నాడు. గాలేలో ఉన్నప్పుడే అతనికి తీవ్రమైన వైరల్ జ్వరం సోకిందని కోటక్ వెల్లడించాడు.కులదీప్ రెండు రోజులుగా నెట్ ప్రాక్టీస్‌కు దూరంగా ఉండటానికి అధికంగా ప్రయాణం చేసి విశ్రాంతి లేకపోవడం కారణమని బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే గతంలో పేర్కొన్నాడు. తాజాగా కోటక్ మాటలు దానికి భిన్నంగా ఉండటం గమనార్హం. 'కుల్దీకి ఆరోగ్యం సరిగా లేనప్పుడు ఆడటం గురించి ఆలోచించడంలో అర్థం లేదు. లంక జట్టులో నలుగురు లెఫ్ట్ హ్యాండర్స్ ఉండటం, కులదీప్ అందుబాటులో లేకపోవడంతోనే మేం ఆఫ్‌స్పిన్నర్ సారాంశ్ జైన్‌కు అరంగేట్రం అవకాశం కల్పించాం' అని కోటక్ వివరించాడు. ప్రస్తుతం కులదీప్ ఆరోగ్యం మెరుగ్గా ఉందని ఆయన తెలిపాడు.రెండో టెస్టులో వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్‌కు మరోసారి గాయమైంది. శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన బంతి పంత్ ఎడమ చేతి ముంజేతికి బలంగా తాకింది. నొప్పితో అల్లాడిన పంత్ కేవలం 3 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగారు. దీనిపై స్పందించిన కోటక్, పంత్ కోలుకుంటున్నాడని, రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశాడు.

నైట్‌క్లబ్ ఘటనలో ఇంగ్లండ్ స్టార్ బౌలర్‌కు సంకెళ్లు.. అక్కడే బెన్ స్టోక్స్!

ఇంగ్లండ్ ఆటగాళ్లు తరచూ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటూ ఉంటారు. గతంలో నైట్ క్లబ్ గొడవలో ఇంగ్లీష్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ చిక్కుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఇంగ్లండ్ స్టార్ బౌలర్ బ్రైడన్ కార్స్ కు సంబంధించి ఓ వార్త వైరల్ అవుతోంది. అతడిని డెర్బీలోని ఓ నైట్‌క్లబ్ వెలుపల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వీడియోలో కార్స్ చేతులకు వెనుకకు సంకెళ్లు వేసి, పోలీసు అధికారులు అతడిని చుట్టుముట్టి ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే కార్స్‌ను అరెస్టు చేయలేదని, ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండానే విడుదల చేసినట్లు సమాచారం. డర్హామ్ జట్టు తరఫున కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ ఆడిన అనంతరం జట్టు సభ్యులు విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వీడియోలో ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ కూడా అక్కడే కనిపించడం మరింత చర్చకు దారితీసింది. డర్హామ్ జట్టు తరఫున అదే మ్యాచ్‌లో ఆడిన స్టోక్స్.. డెర్బీషైర్‌పై జట్టు ఘన విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే నైట్‌క్లబ్‌లో జరిగిన ఘటన ఇంగ్లండ్ జట్టు అధికారిక కార్యక్రమంలో భాగం కాదని తెలుస్తోంది. దీనిపై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు స్పందిస్తూ.. డెర్బీలో జరిగినట్లు సమాచారం అందిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది. దర్యాప్తు పూర్తయ్యే వరకు కార్స్‌పై తదుపరి చర్యల విషయమై స్పష్టత వచ్చే అవకాశం లేదు. మొత్తంగా ప్రస్తుతం కార్స్‌పై ఎలాంటి క్రిమినల్ అభియోగాలు లేవు. పోలీసులు అతడిని ఘటనాస్థలంలో తాత్కాలికంగా అదుపులోకి తీసుకుని అనంతరం విడుదల చేసినట్లు స్థానిక రిపోర్టులు పేర్కొంటున్నాయి.




పడిక్కల్‌ను పక్కన పెట్టలేరు.. ఇక్కడ కోచ్‌గా గంభీర్‌కు పెద్దగా పని లేదు: క్రిస్ శ్రీకాంత్



శ్రీలంకతో రెండో టెస్టులో టీమిండియా బ్యాటర్ దేవదత్ పడిక్కల్ మరోసారి అదరగొట్టాడు. తొలి టెస్టులో అద్భుత శతకంతో ఆకట్టుకున్న అతడు.. రెండో టెస్టులోనూ 117 పరుగులతో సెంచరీ నమోదు చేశాడు. గాయంతో సాయి సుదర్శన్ దూరం కావడంతో తుది జట్టులో చోటు దక్కించుకున్న పడిక్కల్.. వరుస సెంచరీలతో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్.. భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. సాయి సుదర్శన్‌ను మూడో స్థానంలో కొనసాగించాలని గంభీర్ గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇక పడిక్కల్‌ను భవిష్యత్తులో పక్కన పెట్టలేరని తెలిపాడు.'తొలి టెస్టులోనే 200కు పైగా పరుగులు చేసిన పడిక్కల్‌ను భవిష్యత్తులో ఎలా పక్కన పెడతారు? గంభీర్ ఎప్పుడూ ఏదో ఒకటి చెబుతూ ఉంటాడు. శ్రీలంక, అఫ్గానిస్థాన్ లాంటి జట్లపై గెలిచిన తర్వాత మాత్రమే చాలా ఎక్కువగా మాట్లాడతాడు. శ్రీలంకతో సిరీస్‌లో కోచ్‌గా గంభీర్‌కు పెద్దగా పని లేదు. ఎందుకంటే లంక జట్టు అంత గొప్పగా ప్రదర్శన చేయడం లేదు. కాబట్టి సిరీస్‌ను టీమిండియానే గెలుచుకుంటుంది. అందులో ఎలాంటి అనుమానం లేదు. అయితే గంభీర్‌ను వ్యక్తిగతంగా విమర్శించడం నా ఉద్దేశం కాదు. అతడు మంచి ప్లేయర్. ఆటను బాగా అర్థం చేసుకోగలడు. కానీ గంభీర్ ఆటగాళ్లతో మరింత కమ్యూనికేట్ చేస్తే బాగుంటుంది' అని క్రిస్ శ్రీకాంత్ వెల్లడించాడు.

బాలికపై లైంగిక వేధింపులు.. ద్రోణాచార్య అవార్డు గ్రహీతపై పోక్సో కేసు



16 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై ద్రోణాచార్య అవార్డు గ్రహీత జిమ్నాస్టిక్స్ కోచ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. 45 ఏళ్ల జిమ్నాస్టిక్ కోచ్ గణేశ్ ప్రభాకర్‌పై విలెపార్లే ప్రాంతానికి చెందిన బాలిక ఫిర్యాదు చేయడంతో ఈ కేసు నమోదైంది.పోలీసుల సమాచారం ప్రకారం.. బాధితురాలైన బాలిక కొన్నేళ్లుగా జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ తీసుకుంటోంది. ఈ క్రమంలో ఇంటి వద్ద చదువుకుంటున్న బాలికకు కోచ్ వాట్సాప్‌లో 'హాయ్' అంటూ మెసేజ్ పంపాడు. దీంతో కోచ్‌ను సంప్రదించి విషయం తెలుసుకోవాలని బాలిక తల్లి సూచించింది. అనంతరం బాలికను జిమ్నాసియంకు రావాలని, కలిసేందుకు సమయం ఉందా అని కోచ్ అడిగినట్లు తెలుస్తోంది. దీంతో బాలిక అక్కడికి వెళ్లగా.. ఒంటరిగా ఉన్న కోచ్ గణేశ్ ఆమెను అసభ్యంగా తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అక్కడ నుంచి ఎలాగొలా బయటపడిన ఆ బాలిక కాలేజీకి వెళ్లిపోయింది. ముభావంగా ఉన్న ఆమెను పీఈటీ గమనించి ఆరా తీశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. సదరు టీచర్ వెంటనే బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం విలెపార్లే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

తనపై వస్తున్న విమర్శలకు అదిరిపోయే రిప్లయ్ ఇచ్చిన జైస్వాల్

టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ మైదానంలో ప్రదర్శించే దూకుడుపై తాజాగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. శ్రీలంకతో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆటగాడు అసిత ఫెర్నాండోతో జైస్వాల్ వ్యవహరించిన తీరుపై కొందరు మాజీ ఆటగాళ్లు విమర్శించారు. భారత బ్యాటింగ్ కోచ్ సీతాంశు కోటక్ సైతం జైస్వాల్ అంతగా ఫెర్నాండోకు దగ్గరగా వెళ్లి ఉండాల్సి కాదని అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందిస్తూ.. జైస్వాల్



అద్భుతమైన ప్రతిభ ఉన్న ఆటగాడని, కాకపోతే ప్రత్యర్థుల మాటలకు రియాక్ట్ అవుతాడన్నారు. జైస్వాల్ ఇలాంటి చర్యలకు దిగకుండా తన ఆటపై దృష్టి పెట్టాలని ఓ వీడియోలో పేర్కొన్నారు. 'ప్రత్యర్థి ఆటగాడు రెచ్చగొట్టారు నిజమే, కానీ అతనూ(జైస్వాల్) కొంచెం హద్దు మీరి దగ్గరకు వెళ్లాడు' అని హర్షా భోగ్లే అభిప్రాయపడ్డాడు.ఈ వ్యాఖ్యలపై యశస్వి జైస్వాల్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ మరోసారి ఘాటుగా బదులిచ్చాడు. హర్షా భోగ్లే పోస్ట్ చేసిన వీడియోపై స్పందిస్తూ.. 'సదరు ఆటగాడు ఏమన్నాడో మీకు తెలియకుంటే.. ఇలాంటి తీర్పులు ఇవ్వడం ఆపండి. ఎవరైనా హద్దులు మీరి ప్రవర్తిస్తే.. భారత్ తిరిగి పోరాడుతుందని.. వాళ్లకు గట్టిగానే బదులు ఇస్తుందని చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని జైస్వాల్ కామెంట్ సెక్షన్‌లో తన అభిప్రాయాన్ని పంచుకుంటూ.. హర్షా భోగ్లేకు కౌంటర్ ఇచ్చాడు.

శ్రీలంకతో టెస్టులో రిషభ్ పంత్ అరుదైన ఘనత

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో హాఫ్ సెంచరీతో రాణించిన భారత ఆటగాడు, వికెట్ కీపర్ రిషభ్ పంత్ అరుదైన ఘనత సాధించాడు. ఈ క్రమంలోనే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిని అధిగమించాడు. విదేశీ గడ్డపై టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్‌గా పంత్ రికార్డు నమోదు చేశాడు. ధోని 2,496 పరుగులు చేయగా.. పంత్ 2500 పరుగుల మైలురాయిని దాటేశాడు.ఈ మ్యాచ్‌లో రిషబ్ పంత్ 81



బంతుల్లో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. కెరీర్‌లో ఇది అతడికి 21వది. మరో ప్లేయర్ ధ్రువ్ జురెల్ కూడా అర్ధ శతకం చేశాడు. 99 బంతుల్లో తన మూడో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకొన్నాడు. వీరిద్దరి భాగస్వామ్యం కూడా సెంచరీ దాటేసింది. లంచ్ విరామ సమయానికి భారత్ స్కోరు 112 ఓవర్లకు 419/6. క్రీజ్‌లో పంత్ (63×), ధ్రువ్ జురెల్ (59×) ఉన్నారు.

సినిమా

‘అమీర్ లోగ్’ మూవీ రివ్యూ



హైదరాబాద్ బ్యాక్ డ్రాప్, ఓల్డ్ సిటీ కథ అంటూ టీం గట్టిగానే ప్రమోట్ చేయడం.. రానా సంస్థ స్పిరిట్ మీడియా రిలీజ్ చేస్తుండటంతో ‘అమీర్ లోగ్’ అనే చిన్న సినిమాపై బాగానే బజ్ ఏర్పడింది.

నటీనటులు: ఎంసీ హరి – మనోజ్ – శశిధర్ – వేద జలంధర్ – రావణ్ నిట్టూరు – విశ్వేందర్ రెడ్డి – సాయియోగి తదితరులు

సంగీతం: స్మరణ్ సాయి

ఛాయాగ్రహణం: ఎస్వీకే

నిర్మాణం: అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్పి

రచన – దర్శకత్వం: రమణా రెడ్డి సోమ

హైదరాబాద్ బ్యాక్ డ్రాప్, ఓల్డ్ సిటీ కథ అంటూ టీం గట్టిగానే ప్రమోట్ చేయడం.. రానా సంస్థ స్పిరిట్ మీడియా రిలీజ్ చేస్తుండటంతో ‘అమీర్ లోగ్’ అనే చిన్న సినిమాపై బాగానే బజ్ ఏర్పడింది. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అంచనాలను అందుకుందా? తెలుసుకుందాం పదండి.

కథ: హైదరాబాద్ లోని ఓ బస్తీలో ఖాళీగా తిరిగే ముగ్గురు కుర్రాళ్ళు శ్రీను (హరి).. ఫరూక్ (మనోజ్).. మల్లేష్ (శశిధర్).. ఇంట్లో వాళ్ళ మాట వినకుండా ఆవారాగా తిరుగుతుంటారు. ఓ రోజు బస్తీలోనే నజీర్ (సాయి యోగి)తో క్రికెట్ విషయంలో వీరికి గొడవ జరుగుతుంది. అది పెద్ద వివాదంగా మారడంతో ఈ ముగ్గురూ అక్కడా భావించే గీత (వేద జలంధర్) వాళ్లకు ఇంట్లో వాళ్ళ కష్టాలు చెప్పి జ్ఞానోదయం చేస్తుంది. దీంతో ఆ ముగ్గురు పని మీద దృష్టిపెడతారు. ఇంతలో శ్రీను ఆఫీసు వాళ్లతో చిన్న ఘర్షణ జరిగి వారితో క్రికెట్ ఆడి గెలుస్తామని బెట్ కడతాడు. దీంతో సాఫ్ట్ వేర్ జట్టుకి.. బస్తీ టీంకి మధ్య క్రికెట్ మ్యాచ్ జరగ్గుతుంది. మరి ఈ మ్యాచ్ లో బస్తీ జట్టు గెలిచిందా లేదా? తర్వాత ఎలాంటి పరిణామాలు జరిగాయి. మధ్యలో ఈ ముగ్గురు మిత్రుల జీవితాలను ప్రభావితం చేసిన బిర్యానీ కథేంటి అన్నది తెర మీద చూసి తెలుసుకోవాలి.

కథనం – విశ్లేషణ: ఖాళీగా ఉండే మిత్రుల అల్లరిని చూపించి.. ఏదో ఒక పాయింట్లో వారిలో రియలైజేషన్ వచ్చి జీవితంలో బాగుపడే ప్రయత్నం చేసే కథలు తెలుగు తెరపై చాలానే చూశాం. పెళ్లి చూపులు.. హుషారు.. మేమ్ ఫేమస్.. జాతిరత్నాలు.. ఇలా చ్లలా సినిమాలు ఇదే లైన్లోనే నడుస్తాయి. వీటిలో ఒక్కో సినిమా బ్యాక్ డ్రాప్.. ట్రీట్మెంట్ ఒక్కోలా ఉంటాయి. ‘అమీర్ లోగ్’ ఇదే లైన్లో సాగుతూ.. పాత బస్తీ నేపథ్యంలో నడిచే కథ. పక్కా హైదరాబాదీ భాష-యాసతో పాటు ఇక్కడ బాగా ఫేమస్ అయిన బిర్యానీ ఫ్లేవర్ ను కూడా ఈ కథకు గట్టిగా దట్టించారు. ఈ బ్యాక్ డ్రాప్ వల్ల ఈ కథకు కొంత ప్రత్యేకత చేకూరిన మాట వాస్తవం. అదే సమయంలో బిర్యానీలో ఫ్లేవర్ ఉంటే బాగుంటుంది కానీ.. మోతాదు ఎక్కువైతే ఇబ్బంది అన్నట్లు ‘అమీర్ లోగ్’కు కూడా బ్యాక్ డ్రాప్ తాలూకు ఫ్లేవర్ ఎక్కువైంది. అథెంటిక్ పాతబస్తీ సినిమా చూపించాలనే ప్రయత్నంలో మోతాదుకు మించిన ఉర్దూ డైలాగులు.. లోకల్ ఫ్లేవర్ తో సినిమా పరిధిని కొంచెం తగ్గించేశారనిపిస్తుంది. ఐతే డిఫరెంట్ మూవీస్ చూడాలనుకునేవారు ‘అమీర్ లోగ్’పై ఒక లుక్కేయొచ్చు.

‘అమీర్ లోగ్’ ఫస్ట్ హాఫ్ అంతా నిదానంగా సాగుతుంది. మొదటి అరగంట అయితే ఆ ముగ్గురు ఫ్రెండ్స్ ఖాళీగా తిరగడం మీద రొటీన్ సీన్లతో నడిపించేశారు. ఆ తర్వాత ముగ్గురు హీరోలు జీవితంలో స్థిరపడే ప్రయత్నం చేశాక వారి జీవితాలు ఎలా నడిచాయన్నది కూడా కొంచెం రొటీన్ ఎమోషన్ తోనే నడుస్తుంది. సినిమాలోకి క్రికెట్ ప్రవేశించాకే ఊపు వస్తుంది. ఈ సన్నివేశాలతో యూత్ బాగా కనెక్ట్ అవుతారు. హీరోలు ఆ క్రికెట్ మ్యాచ్ లోనే గెలుస్తారా? ఓడిపోతారా అనే బ్యాంగ్ ఇవ్వడంతో ఇంటర్వెల్ ఆకట్టుకుంటుంది. తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తి నెలకొంటుంది. క్రికెట్ మ్యాచ్ అయ్యాక కథ బిర్యానీ మీదికి మళ్లుతుంది. ఆ సన్నివేశాలు ఓకే అనిపిస్తాయి. దీంతో పాటుగా మనసుకు నచ్చింది చెయ్యాలని చెప్పే సీన్లు.. ఒక లవ్ ట్రాక్ తో ‘అమీర్ లోగ్’ సెకండాఫ్ బాగానే నడుస్తుంది. ద్వితీయార్ధంలో ఎమోషనల్ సీన్లు కూడా బాగానే పండాయి. కామెడీ పర్వాలేదనిపిస్తుంది. ఈ సినిమాకు ఓపెన్ ఎండింగ్ ఇచ్చారు. ఈ సినిమా ‘అంగ్రేజ్’ తరహాలో లోకల్ హైదరాబాదీలకు బాగా కనెక్ట్ అవుతుంది. కానీ మిగతా ప్రేక్షకులకు కూడా కనెక్టయ్యేలా యూనియర్శల్ అప్పీల్ ఉంటే మరింతగా ప్రేక్షకులకు రీచ్ అయ్యేది.

నటీనటులు: మూడు ప్రధాన పాత్రల్లో నటించిన హరి, మనోజ్, శశిధర్ బాగానే నటించారు. కొత్తవాళ్నైనా లోకల్ హైదరాబాద్ కుర్రాళ్ళుగా బాగానే సెట్ అయ్యారు. తిమ్మరాజు పల్లి టీవీ సినిమాలో కథానాయికగా బాగా మెప్పించిన వేద జలంధర్ ఇందులో చేసిన పాత్రకు అంతగా సెట్ అవలేదు. అంత క్యూట్ హీరోయిన్ కి ఇలాంటి పాత్ర ఇచ్చారేంటి అనిపిస్తుంది. చాచా పాత్రలో విశ్వేందర్ చాలా బాగా నటించాడు. రావణ్ నిట్టూరు.. సాయియోగి.. మిగిలిన కొత్త నటీనటులు వారి వారి పాత్రల్లో పర్వాలేదనిపించారు.

సాంకేతిక వర్గం: ‘అమీర్ లోగ్’కు నిర్మాణ విలువలు ఒకే అనిపిస్తాయి. సాంకేతికంగా సినిమా ఇంకాస్త మెరుగ్గా ఉండాల్సిందనిపిస్తుంది. కెమెరామన్ ఎస్వీకే విజువల్స్ పర్వాలేదనిపించినా ఈ సినిమాలో చాలా సీన్లకు కలర్ గ్రేడింగ్.. డిఐ సరిగా చేయలేదు. స్మరణ్ సాయి బ్యాగ్రౌండ్ మ్యూజిక్ యావరేజ్. పాటలు మాత్రం బాగున్నాయి. దర్శకుడు పాత కథే తీసుకున్నా హైదరాబాద్ బ్యాక్ డ్రాప్ లో కొత్తగా చెప్పాలనుకున్నాడు కానీ కాస్త రొటీన్ గానే తెరకెక్కించాడు. తన రైటింగ్.. టేకింగ్ ఓకే అనిపిస్తాయి. డైలాగులు కొన్ని చోట్ల బాగున్నా.. ఉర్దూ మోతాదు ఎక్కువైపోయింది.

చివరగా: అమీర్ లోగ్.. పర్వాలేదనిపించే హైదరాబాదీ ఫ్లేవర్

రేటింగ్ – 2.5/5


చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా బాబీ సినిమా

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ’వాల్తేరు వీరయ్య’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్



సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం ’విశ్వనాథ్ అండ్ సన్స్’ తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో ’విశ్వనాథ్ అండ్ సన్స్’ రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన ’విశ్వనాథ్ అండ్ సన్స్’.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టా÷-గ్గ÷ట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. విడుదలకు ముందు ఉన్న అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. దీంతో రోజురోజుకూ థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన ’విశ్వనాథ్ అండ్ సన్స్’.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.



రాముడి సుగుణాలు కనిపించాలంటే

రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే: యశ్

కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం ’టాక్సిక్’, ’రామాయణ’ చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ’రామాయణ’ గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. ’రామాయణ’ కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు.

గోగీతా చిక్వాడ్జే దర్శకత్వంలో ..వారణాసి మేకింగ్ వీడియో



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ’వారణాసి’పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్‌పై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్‌పై ఓ ఇంట్రెస్టింగ్ విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమౌళితో పాటు మరో దర్శకుడు కూడా ’వారణాసి’ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన ప్రధాన సినిమాకు దర్శకత్వం వహించడం లేదు. ’వారణాసి’ ఎలా రూపుదిద్దుకుంటోంది? రాజమౌళి టీమ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరయ్యారు? భారీ సెట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా తెరకెక్కుతున్నాయి? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందించే బాధ్యతను ఆయన తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగీతా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు సమాచారం. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. ’వారణాసి’ ప్రీ-ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ పక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి అనేక కీలక అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ ’వారణాసి’ విషయంలో మాత్రం సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ-ప్రొడక్షన్‌లో ఆయన చేసే ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ స్థాయిలో విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి విషయాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది. రాజమౌళి సినిమాల మేకింగ్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. ’బాహుబలి’ చిత్రానికి సంబంధించిన మేకింగ్ కంటెంట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే ’ఆర్ఆర్ఆర్’కు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు కూడా సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ’వారణాసి’ మేకింగ్ డాక్యుమెంటరీని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తు న్నట్లు తెలుస్తోంది. సినిమా వెనుక ఉన్న అసలు శ్రమను, రాజమౌళి విజన్‌ను, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్న విధానాన్ని ఇందులో చూపించనున్నట్లు సమాచారం. ’వారణాసి’ కేవలం భారతీయ మార్కెట్‌ను మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సినిమా కావడంతో.. మేకింగ్ డాక్యుమెంటరీకి కూడా గ్లోబల్ స్థాయిలో మంచి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు టాక్. సినిమా డిజిటల్ హక్కులతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీని కూడా ప్యాకేజీలో భాగంగా చేసే ఆలోచనపై చర్చలు జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844